శనివారం
20-05-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 327
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఫ్రాన్స్‌లో భారీ భూకంపం

సునామీ హెచ్చరికలు జారీ

ఫ్రాన్స్‌లో భారీ భూకంపం సంభవించింది. న్యూ కలెడోనియాలోని లాయల్టీ ఐలాండ్స్‌కు ఆగ్నేయంగా 7.7 తీవ్రతతో శుక్రవారం భూకంపం సంభవించినట్లు వనౌటు మెట్రోలాజికల్ విభాగం వెల్లడించింది. దక్షిణ పసిఫిక్ దేశాలకు సునామీ హెచ్చరికలను జారీ చేసింది.

2లో

రూ.2 వేల నోట్లు వెనక్కి

పూర్తిగా రద్దు కాదు
సెప్టెంబరు 30 లోగా మార్చుకోవాలి
ఆర్‌బీఐ కీలక నిర్ణయం

ముంబై: రూ.2వేల నోట్లపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. మార్కెట్‌లో చలామణీలో ఉన్న నోట్లను వెనక్కి తీసుకోవాలని నిర్ణయించింది. వినియోగదారులకు రూ.2వేల నోట్లు ఇవ్వొద్దని బ్యాంకులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలు తక్షణమే అమల్లోకి వస్తాయని స్పష్టంచేసింది. అయితే, ఈ నోట్లను పూర్తిగా రద్దు చేయడం లేదని, ఇప్పటికీ లావాదేవీలకు ఈ నోట్లను వినియోగించుకోవచ్చని తెలిపింది. రూ.2వేల నోట్లు ఉన్నవారు మే 23 నుంచి సెప్టెంబరు 30లోగా బ్యాంకులు, ఆర్‌బీఐ కార్యాలయాల్లో మార్చుకోవచ్చని ఆర్‌బీఐ వివరించింది. ఒక విడతలో గరిష్ఠంగా రూ.20 వేల వరకు మార్పిడికి అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొంది. డిపాజిట్ విషయంలో మాత్రం ఎలాంటి నిబంధనలు విధించలేదు. బ్యాంకు రోజువారీ కార్యకలాపాలకు ఇబ్బంది లేకుండా నోట్ల మార్పిడి ప్రక్రియ చేపట్టాలని బ్యాంకులకు ఆర్‌బీఐ సూచించింది. దేశంలోని 19 ఆర్‌బీఐ ప్రాంతీయ కార్యాలయాల్లోనూ రూ.2వేల నోట్లు మార్చుకునే సౌలభ్యం కల్పిస్తున్నట్టు తెలిపింది. ఆర్‌బీఐ ప్రకటన ప్రకారం 2016 నవంబర్‌లో రూ.1000, రూ.500 నోట్ల రద్దు నేపథ్యంలో నగదు అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూ.2వేల నోట్లను తీసుకొచ్చింది. 2018-19లోనే ఈ నోట్ల ప్రింటింగ్‌ను నిలిపివేసినట్లు తెలిపింది. 2017 మార్చి నాటికి చలామణీలో ఉన్న నగదు మొత్తంలో రూ.2వేల నోట్ల వాటా 89 శాతంగా ఉంది. 2018 మార్చి 31 నాటికి రూ.6.73 లక్షల కోట్ల విలువైన నోట్లు చలామణీలో ఉన్నాయి. 2023 మార్చి నాటికి ఆ విలువ రూ.3.62 లక్షల కోట్లకు తగ్గింది. అంటే చలామణీలో ఉన్న మొత్తం నగదులో రూ.2వేల నోట్ల వాటా 10.8 శాతానికి చేరిందని ఆర్‌బీఐ తెలిపింది. 'క్లీన్ నోట్ పాలసీలో భాగంగా తాజాగా రూ.2వేల నోట్ల చలామణీని వెనక్కి తీసుకోవాలని నిర్ణయించినట్లు ఆర్‌బీఐ తెలిపింది. అయితే, రూ.2వేలు నోటు అనేది ప్రస్తుతం లావాదేవీలకు వినియోగించుకోవచ్చని (లీగల్ టెండర్) స్పష్టం చేసింది. 2013-14లోనూ ఇదే తరహాలో సర్క్యులేషన్‌లో ఉన్న నోట్లను వెనక్కి తీసుకున్నామని ఆర్‌బీఐ గుర్తుచేసింది. రూ.2 వేల నోట్లను ప్రజలు బ్యాంకుల ద్వారా మార్పిడి చేసుకోవచ్చని ఆర్‌బీఐ తెలిపింది. ఏదైనా బ్యాంక్ శాఖ నుంచి మే 23 నుంచి సెప్టెంబరు 30 లోగా రూ.2వేల నోట్లను మార్పిడి చేసుకోవచ్చని స్పష్టం చేసింది. అన్ని బ్యాంకులూ రూ.2వేల నోట్ల జారీని నిలిపివేయాలని, ఈ ఆదేశాలను తక్షణమే అమలు చేయాలని ఆర్‌బీఐ స్పష్టం చేసింది.

ఉక్కపోత

ఉష్ణోగ్రతలు తగ్గినా వేడి మంట

మరో మూడు రోజులు ఇంతేనంటున్న విపత్తుల సంస్థ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: 'స్వామీ... ఏమి నీ లీల...వేసుకోగానే తడిచిపోతుంది, విప్పగానే ఆరిపోతుంది' ఈ సందేశం శుక్రవారం సోషల్ మీడియాలో భారీస్థాయిలో వైరల్ అయింది. దీనికి కారణం ఉక్కపోతను భరించడం ఎంత ఇబ్బందో ప్రజలు ప్రత్యక్షంగా అనుభవించారు. వారం రోజుల పాటు అత్యధిక ఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరి అయిన రాష్ట్ర ప్రజలు...ఎండ తీవ్రత కొంత తగ్గుముఖం పట్టినప్పటికీ భరించలేనంత తీవ్ర ఉక్కపోతకు గురయ్యారు. నాల్గురోజుల క్రితం 48 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు తాజాగా రెండు నుంచి మూడు డిగ్రీలు తగ్గినప్పటికీ, వేడి మాత్రం అదే మోతాదులో మంట పుట్టించింది. దీనికితోడు ఉబ్బ తీయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అదే పరిస్థితి కొనసాగింది. గాలి ఏమాత్రం లేకపోవడం, ఎండలో తీవ్రత ఎక్కువగా ఉండటం, దీనికి ఉక్కపోత తోడు కావడంతో ఆ విచిత్ర వాతావరణ పరిస్థితులకు ప్రజలు తల్లడిల్లారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చంటి పిల్లలు ఇబ్బందులు పడ్డారు. ఏసీల్లేకుండా పనిచేయలేని పరిస్థితి నెలకొనడంతో కరెంట్ పోయిన ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు తీవ్ర ఇక్కట్లకు లోనయ్యారు. ఎండ తీవ్రత కంటే ఈ ఉక్కపోతను తట్టుకోవడమే కష్టంగా ఉందని వారు పేర్కొన్నారు. ఇదే పరిస్థితి మరో మూడు రోజులు ఉంటుందని విపత్తుల సంస్థ వెల్లడించింది. దీనికితోడు రాష్ట్రవ్యాప్తంగా 23 మండలాల్లో శనివారం వడగాల్పులు ప్రభావం చూపనున్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డా.బీఆర్ అంబేద్కర్ తెలిపారు. మిగిలిన చోట్ల కూడా ఎండ ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. గుంటూరు 4, ఎన్టీఆర్ 7, పల్నాడు 4, కడప జిల్లాలోని 8 మండలాలు, వడగాడ్పుల ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. నంద్యాల జిల్లా చాగలమర్రిలో 46.2

- మిగతా 2 లో

నేడు సిద్ధ, డీకే ప్రమాణ స్వీకారోత్సవం

ప్రతిపక్ష నేతలు హాజరయ్యే అవకాశం

2లో

అవినాశ్ మళ్లీ డుమ్మా

మా అమ్మ ఆరోగ్యం బాగోలేదు
విచారణకు రాలేనంటూ సీబీఐకి లేఖ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మాజీమంత్రి మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి శుక్రవారం కూడా సీబీఐ విచారణకు హాజరుకాలేదు. తన తల్లి శ్రీలక్ష్మి అనారోగ్య కారణాల దృష్ట్యా విచారణకు రాలేనని పేర్కొంటూ సీబీఐకి ఆయన లేఖ రాశారు. ఈ మేరకు లిఖితపూర్వకంగా సమాచారం ఇచ్చేందుకు ఎంపీ తరపు న్యాయవాదులు సీబీఐ కార్యాలయానికి వెళ్లారు. తన తల్లికి గుండెపోటు రావడంతో ఆమెను పులివెందులలోని ఈసీ గంగిరెడ్డి ఆస్పత్రిలో చేర్చినట్లు లేఖలో అవినాశ్ పేర్కొన్నారు. సీబీఐ విచారణకు అవినాశ్‌రెడ్డి చివరి నిమిషంలో గైర్హాజరు కావడం వరుసగా ఇది రెండోసారి. ఈనెల 16న ఆయన విచారణకు హాజరుకావాల్సి ఉన్నప్పటికీ ముందస్తు కార్యక్రమాలను కారణంగా చూపుతూ హైదరాబాద్

- మిగతా 2 లో

ఆర్-5 జోన్‌లో 47,017 ఇళ్లు

కేంద్రానికి ప్రతిపాదనలు పంపిన రాష్ట్ర ప్రభుత్వం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆర్-5 జోన్‌పై రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా ముందుకు కదులుతోంది. ఆ జోన్‌లో ఇతర ప్రాంతాల్లోని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వొచ్చని, అయితే కోర్టు తుది తీర్పుకు లోబడే అవి చెల్లుబాటు అవుతాయని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పినప్పటికీ ప్రభుత్వం మాత్రం ముందుకే వెళుతోంది. ఇళ్ల స్థలాలతో పాటు ఇంటి నిర్మాణాలు కూడా చేపడితే తర్వాత తీర్పు ఎలా ఉన్నా వైసీపీ ప్రభుత్వానికే ఆ ఘనత మిగిలిపోతుందని పాలకులు భావిస్తున్నారు. ఈ నెలాఖరులో సీఎం చేతుల మీదుగా పట్టాల పంపిణీకి రంగం సిద్ధం చేస్తున్నారు. ఇందుకోసం ఇక్కడి స్థలాల్ని దాదాపు రూ.20 కోట్లు పెట్టి చదును చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. పట్టాల పంపిణీ రోజే గృహ

- మిగతా 2 లో

ఇదీ లోకం!

బ్రిజ్‌భూషణ్‌కు ఏ పదవి ఉండరాదు: నారాయణ డిమాండ్

రెజ్లర్లకు సీపీఐ నేతల సంఘీభావం

న్యూఢిల్లీ: తమ గౌరవం కోసం పోరాడుతున్న మహిళా రెజ్లర్లకు భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) పూర్తి మద్దతు తెలిపింది. పోరాటానికి, డిమాండ్లకు అండగా నిలుస్తామని పార్టీ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. రెజ్లర్లను వేధించిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా తొలగించాలని, ఆయన

- మిగతా 2 లో

జస్టిస్ మిశ్రా, విశ్వనాథన్ ప్రమాణం

34కు చేరిన సుప్రీం జడ్జిల సంఖ్య

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాతో పాటు సీనియర్ న్యాయవాది కల్పతి వెంకటరమణ్ విశ్వనాథన్ సుప్రీంకోర్టు జడ్జిలుగా నియమితులయ్యారు. సుప్రీంకోర్టు ఆడిటోరియంలో ఇద్దరు కొత్త జడ్జిలతో సీజేఐ డీవై చంద్రచూడ్ ప్రమాణ స్వీకారాన్ని చేయించారు. కొత్త న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ఇద్దరు న్యాయమూర్తుల నియామకాన్ని ట్విట్టర్ ద్వారా ప్రకటించారు. జస్టిస్ మిశ్రా, జస్టిస్ విశ్వనాథన్ నియామకాలను ఈనెల 16న సుప్రీం కొలీజియం సిఫార్సు చేసింది. రాష్ట్రపతి

- మిగతా 2 లో

జూన్ 2 వరకు ఇమ్రాన్‌కు ఉపశమనం

అరెస్టు నుంచి రక్షణగా బెయిలిచ్చిన ఏటీసీ కోర్టు

లాహోర్: పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌పై ఈనెల 9 తర్వాత దాఖలైన మూడు కేసుల్లో జూన్ 2 వరకు అరెస్టు చేయొద్దని లాహోర్ ఏటీసీ కోర్టు శుక్రవారం ఆదేశాలిచ్చింది. అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ బెయిల్ మంజూరు చేసింది. దర్యాప్తులో భాగస్వాములు కావాలని 70ఏళ్ల పీటీఐ చైర్మన్‌కు ఆదేశాలిచ్చింది. లాహోర్‌లో కార్ప్స్ కమాండర్ హౌస్‌పై దాడికి సంబంధించి కూడా ఇమ్రాన్‌పై కేసు ఉన్నది. ఏటీసీ కోర్టురూమ్ వద్ద విలేకరులతో ఇమ్రాన్ ఖాన్ మాట్లాడుతూ 35ఏళ్లలో ఇటువంటి పరిస్థితిని ఎన్నడూ చూడలేదన్నారు. దేశంలో పౌర-ప్రాథమిక హక్కులు, స్వేచ్ఛ అంతమైపోయినట్లు ఉన్నదని, కేవలం కోర్టులే మానవహక్కులను పరిరక్షిస్తున్నాయని అన్నారు. చివరి బంతి వరకు వెనక్కు తగ్గేదే లేదని చెప్పారు. ఏటీసీ ఆవరణలోకి తన వాహనానికి అనుమతిచ్చాకే విచారణకు హాజరయ్యారు.

విశాలాంధ్ర ప్రపంచం

'ప్రజలే... ప్రజల్ని కాపాడుకోగలరు'

ఏథెన్స్ ర్యాలీలో కేకేఈ నినాదం

ఏథెన్స్: గ్రీస్‌లో ఈనెల 21న ఎన్నికలు జరగనున్నాయి. దీంతో గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) ప్రచార ర్యాలీలను పెద్దఎత్తున నిర్వహిస్తోంది. రాజధాని ఏథెన్స్‌లో నిర్వహించిన ప్రదర్శనలో ప్రజలే ప్రజలను కాపాడుకోగలరని నినాదమిచ్చింది. ఏథెన్స్‌లోని సింటాగ్మా స్క్వేర్‌లో జరిగిన ప్రదర్శనలో వేలాది మంది కార్యకర్తలు, అన్ని వయస్సుల మహిళలు, పురుషులు పాల్గొన్నారు. 'కేకేఈ ముందుంటే ప్రజలే ప్రజలను కాపాడుకోగలరు' అని పార్టీ ప్రధాన కార్యదర్శి దిమిత్రీస్ కౌట్సోంబస్ ర్యాలీనుద్దేశించి అన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల లక్షలాది మంది వర్కర్లు జీఎస్ఈఈ, ఏడీఈడీవైలో కేకేఈని రెండవ స్థానంలో నిలబెట్టారని, దేశ కార్మికశక్తి అగ్రనాయకత్వాన్ని ఏథెన్స్ కార్మికులు కట్టబెట్టారన్నారు. కేకేఈ పోరాటాల్లో కలిసివచ్చిన పింఛన్‌దారులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, టీచర్లు, కళాకారులు, అన్ని వర్గాల ప్రజలతో కలిసి ఉజ్వల భవితకు మార్గం సుగమం చేద్దామని దిమిత్రీస్ ఉద్ఘాటించారు. కేకేఈ బలం పెరిగితే గ్రీస్‌తో పాటు ఫ్రాన్స్‌లో జర్మనీలో పోరాటాలు చేస్తున్న కార్మికులకు బలం చేకూరుతుందన్నారు. నిజాయితీ, సుస్థిర, ఉద్యమ పథంలో ముందుకు సాగుతూ మెరుగైన భవిత సాధిద్దామని పిలుపునిచ్చారు.

ఫ్రాన్స్‌లో భారీ భూకంపం

తీవ్రత 7.7గా నమోదు

సునామీ హెచ్చరికలు జారీ

వనౌటు: ఫ్రాన్స్‌లో భారీ భూకంపం సంభవించింది. న్యూ కలెడోనియాలోని లాయల్టీ ఐలాండ్స్‌కు ఆగ్నేయంగా 7.7 తీవ్రతతో శుక్రవారం భూకంపం సంభవించినట్లు వనౌటు మెట్రోలాజికల్ విభాగం వెల్లడించింది. దక్షిణ పసిఫిక్ దేశాలకు సునామీ హెచ్చరికలను జారీ చేసింది. ఈ భూకంపం వల్ల తీర ప్రాంతాల్లో అసాధారణ నీటి ప్రవాహం ఉండవచ్చు అని న్యూజిలాండ్ నేషనల్ ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ అంచనా వేసింది. ఫిజీ, కిరిబాటి, పాపువా, న్యూ గినియా, గువామ్‌తోపాటు ఇతర పసిఫిక్ దీవులకు అలలు తాకే అవకాశం ఉందని వనౌటు మెట్రోలాజికల్ విభాగం హెచ్చరించింది. భూకంప కేంద్రం ఫిజీకి నైరుతి, న్యూజిలాండ్‌కు ఉత్తరం, ఆస్ట్రేలియాకు తూర్పున లాయల్టీ దీవులకు సమీపంలో ఉన్నట్లు యుఎస్ జియోలాజికల్ సర్వే తెలిపింది. పసిఫిక్ మహాసముద్రం చుట్టూ అత్యధిక భూకంపాలు సంభవిస్తాయని పేర్కొంది. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా తీర ప్రాంతాల ప్రజలను ఎత్తైన ప్రదేశాలకు వెళ్లాలని వనౌటు జాతీయ విపత్తు నిర్వహణ కార్యాలయం సూచించింది.

86 రష్యా సంస్థలపై బ్రిటన్ కొత్త ఆంక్షలు

లండన్: రష్యాకు చెందిన 86 సంస్థలపై కొత్తగా ఆంక్షలను బ్రిటన్ విధించింది. రష్యా చమురు, రక్షణ, రవాణా, ఆర్థిక రంగాల ప్రముఖులపై వ్యక్తులపైనా ఆంక్షలు అమలు చేసినట్లు బ్రిటన్ విదేశాంగ కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన వెలువరించింది. రష్యా అణసంస్థ రోసాటమ్‌పైనా ఆంక్షలు ఉన్నట్లు తెలిపింది.

సైన్యానికి మద్దతిచ్చే రంగాల సంస్థలపై ఆంక్షలు విధించడం వల్ల పుతిన్‌పై ఒత్తిడి పెంచాలని భావిస్తున్నట్లు పేర్కొంది. జపోరిజ్‌జియా అణుశక్తి కేంద్రం హెడ్ ఓలెగ్ రొమానెన్కోతో పాటు గాజ్‌ప్రోమ్ నెఫ్ట్ బోర్డు డైరెక్టర్లు 13 మంది, ట్రాన్స్‌నెఫ్ట్ బోర్డు డైరెక్టర్లు ఐదుగురు, కలాష్నికోవ్ కన్సర్న్ అధ్యక్షుడు, డైరెక్టర్ జనరల్ అలన్ లుషింకోవ్, వ్లాదిమిర్ లెపిన్ తదితరులపైనా అంక్షలు విధించినట్లు లండన్ వెల్లడించింది.

23న చైనాకు రష్యా ప్రధాని

మాస్కో: రష్యా ప్రధాని మైఖెల్ మిషుస్టిన్ ఈనెల 23, 24 తేదీల్లో చైనాలో అధికారికంగా పర్యటించనున్నారు. ఈ మేరకు రష్యా ప్రభుత్వం శుక్రవారం తెలిపింది. బీజింగ్‌లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, ప్రధాని లీ కాంగ్‌తో పాటు ఇతర అధికారులతో మైఖెల్ భేటీ కానున్నట్లు వెల్లడించింది.

రష్యా, చైనా వాణిజ్య సహకారం, ఆర్థిక పరిస్థితులు ముఖ్యంగా పారిశ్రామిక, ఇంధనం, రవాణా, మౌలికవసతులు, వ్యవసాయం తదితర రంగాల్లో సహకారంపై ప్రధానంగా చర్చిస్తారని ప్రకటన పేర్కొంది. అనేక ద్వైపాక్షిక ఒప్పందాలపై సంతకాలు జరగనున్నట్లు తెలిపింది.షాంఘైలో జరిగే రష్యా-చైనా బిజినెస్ ఫోరం సమావేశంలోనూ మైఖెల్ పాల్గొంటారని వెల్లడించింది. ఈ సదస్సులో రష్యా, చైనా దేశాల ప్రముఖ కంపెనీల అధినేతలు పాల్గోనున్నారు.

సాక్షర్ భారత్ ఉద్యోగులకు న్యాయం చేయాలి

వెంకట సుబ్బయ్య డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ(గాంధీనగర్): తొలగించిన సాక్షర్ భారత్ ఉద్యోగులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం విజయవాడ ధర్నాచౌక్ వద్ద ఆంధ్రప్రదేశ్ సాక్షర్ భారత్ కో-అర్డినేటర్స్ అసోసియేషన్(ఏఐటీయూసీ) అధ్వర్యంలో ధర్నాలో పాల్గొన్న వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ 2018 ఒక్కసారిగా ఈ ఉద్యోగులను అప్పటి ప్రభుత్వం తొలగించగా వారికి న్యాయం చేస్తామని పాదయాత్రతో పాటు ఎన్నికలప్పుడు జగన్ ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఇచ్చిన హామీ మేరకు కో-ఆర్డినేటర్లుగా విధుల్లోకి తీసుకోని పక్షంలో సాక్షర్ భారత్ ఉద్యోగులు సీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తారని హెచ్చరించారు. క్షర్ భారత్ కో-అర్డినేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సకల నాగేశ్వరరావు మాట్లాడుతూ సాక్షర భారత్ (వయోజన విద్య శాఖ) కార్యక్రమంలో పదేళ్లకుపైగా పనిచేశామన్నారు. పెండింగ్‌లో ఉన్న తొమ్మిది నెలల గౌరవవేతనాన్ని తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యార్హతలు, వయోపరిమితితో సంబంధం లేకుండా స్వచ్ఛభారత్ కార్పొరేషన్‌లో లేక ఇతర శాఖలలో ఉద్యోగాలు కల్పించాలన్నారు. ధర్నాలో ఏఐటీయూసీ నేతలు పడాల రమణ, రేవల్ల పాండురంగ పాల్గొన్నారు.

బ్రిజ్‌భూషణ్‌కు ఏ పదవి ఉండరాదు

(మొదటిపేజీ తరువాయి)

ఇతర ఏ హోదాలోనూ ఉండరాదని డిమాండ్ చేశారు. రెజ్లర్లతో ఆయన ప్రవర్తనను ఆక్షేపించారు. మహిళలు దేశ గౌరవమని, నిరసనకారులకు సీపీఐ అండగా నిలుస్తుందని తెలిపారు. రెజ్లర్ల పోరాటాన్ని జాతీయ స్థాయికి తీసుకెళుతుందని చెప్పారు. నారాయణ శుక్రవారం దిల్లీ, జంతర్‌మంతర్ వద్ద నిరసన తెలుపుతున్న సాక్షిమాలిక్‌తో సహా రెజ్లర్లను కలిసి సంఘీభావం తెలిపారు. ఆయన వెంట సీపీఐ దిల్లీ శాఖ నాయకులు ప్రొఫెసర్ దినేశ్ వార్ష్నే, శంకర్‌లాల్, అబ్సార్ అహ్మద్, ఖేహర్ సింగ్, ముకేశ్ కశ్యప్, రాజేశ్ కశ్యప్, సంజీవ్ కుమార్ రాణా, హైదర్ అలీ, శశికుమార్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ నేత శారదా దేవి ఉన్నారు.

ఉక్కపోత

(మొదటిపేజీ తరువాయి)

డిగ్రీలు, కడప జిల్లా సిద్ధవటంలో 45.2 డిగ్రీలు, పల్నాడు జిల్లా రొంపిచర్లలో 44.9 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 3 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 25 మండలాల్లో వడగాల్పులు వీచాయని వివరించారు. ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు బయటకు రాకుండా ఉడాలన్నారు. ప్రయాణాల్లో ఉన్నవారు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కొన్నిచోట్ల అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని చెట్ల కింద నిలబడరాదని తెలిపారు.

నేడు సిద్ధ, డీకే ప్రమాణ స్వీకారోత్సవం

బెంగళూరు/న్యూఢిల్లీ: కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుకు సన్నాహాలు పూర్తయ్యాయి. ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ శనివారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ నేపథ్యంలో మంత్రివర్గ ఏర్పాటుపై కాంగ్రెస్ అధిష్ఠానంతో చర్చించడానికి సిద్ధరామయ్య, శివకుమార్ శుక్రవారం న్యూఢిల్లీలో ఉన్నారు. ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి అనేక భావసారూప్యత గల ప్రతిపక్ష పార్టీల నేతలు హాజరయ్యే అవకాశం ఉంది. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించిన వారం తర్వాత సిద్ధరామయ్య తన డిప్యూటీ డీకే శివకుమార్‌తో పాటు మంత్రులుగా శాసనసభ్యుల బృందంతో కలిసి శనివారం రెండోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇక్కడి కంఠీరవ స్టేడియంలో మధ్యాహ్నం 12.30 గంటలకు ముఖ్యమంత్రితో పాటు ఆయన మంత్రివర్గంతో గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. 2013లో ఇదే వేదికపై సిద్ధరామయ్య తొలిసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో అధికార బీజేపీని ఢీకొట్టేందుకు ఐక్య ప్రయత్నాల మధ్య ప్రతిపక్ష పార్టీలకు ఈ కార్యక్రమం బల నిరూపణగా మారవచ్చు. పార్టీ కేంద్ర నాయకత్వంతో సుదీర్ఘ చర్చల తర్వాత ఉద్రిక్త ప్రతిష్టంభన ముగిసిన తర్వాత కాంగ్రెస్ గురువారం సిద్ధరామయ్యను తదుపరి ముఖ్యమంత్రిగా, రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు శివకుమార్‌ను ఏకైక ఉప ముఖ్యమంత్రిగా పేర్కొంది. గురువారం జరిగిన కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ (సీఎల్‌పీ) సమావేశంలో సిద్ధరామయ్యను దాని నాయకుడిగా, ముఖ్యమంత్రిగా అధికారికంగా ఎన్నుకున్నారు. ఆ తర్వాత సిద్ధరామయ్య, శివకుమార్ గవర్నర్‌ను కలిశారు. ఆయన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ఆహ్వానించారు. సిద్ధరామయ్య ఎదుర్కోవాల్సిన మొదటి కష్టమైన పని ఏమిటంటే, అన్ని వర్గాలు, ప్రాంతాలు, వర్గాలు, పాత, కొత్త తరం శాసనసభ్యుల నుంచి కూడా ప్రతినిధులను కలిగి ఉండటంలో సమతుల్యతను సాధించే సరైన కలయికలతో కూడిన క్యాబినెట్‌ను ఏర్పాటు చేయడం. కర్నాటక కేబినెట్‌లో 34 మంది మంజూరైనందున, మంత్రి పదవుల కోసం చాలా మంది ఆశావహులు ఉన్నారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా, కాంగ్రెస్ ముఖ్యమంత్రులు, నేతలు హాజరుకానున్నారు. మల్లికార్జున్ ఖర్గే అనేక మంది ముఖ్యమంత్రులు, పార్టీ నేతలకు ఆహ్వానం పంపారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్, ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాకరే, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను ఆయన ఆహ్వానించారు. ప్రమాణ స్వీకారం తర్వాత జరిగే తొలి కేబినెట్ సమావేశంలో కొత్త ప్రభుత్వం ఐదు హామీల అమలుకు చర్యలు తీసుకోవచ్చని భావిస్తున్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడమే మా మొదటి ప్రాధాన్యత అని కాబోయే ఉప ముఖ్యమంత్రి శివకుమార్ అన్నారు. ఇదిలాఉండగా, జాతీయ స్థాయి నాయకులు, ఇతర రాష్ట్రాలకు చెందిన వారు హాజరుకానున్న నేపథ్యంలో ఎలాంటి అడ్డంకులు లేకుండా కార్యక్రమం సజావుగా సాగేందుకు వేదిక చుట్టూ, చుట్టుపక్కల పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టామని అధికారులు తెలిపారు. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం, ప్రమాణ స్వీకారోత్సవాన్ని వీక్షించేందుకు మొత్తం మూడు వేదికలతో ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు.

అవినాశ్ మళ్లీ డుమ్మా

(మొదటిపేజీ తరువాయి)

నుంచి కడప వెళ్లిపోయారు. దీంతో సీబీఐ బృందం కూడా అంతేవేగంగా కడప చేరుకోవడం, అవినాశ్‌రెడ్డి ఇంట్లో లేకపోవడంతో ఈ నెల 19న విచారణకు రావాలంటూ డ్రైవర్‌కు నోటీస్ అందజేశారు. తాజాగా విచారణ కోసం పులివెందుల నుంచి హైదరాబాద్ చేరుకున్న అవినాశ్...మళ్లీ చివరి నిమిషంలో సీబీఐకి లేఖ రాస్తూ తన తల్లి అనారోగ్య కారణాల రీత్యా విచారణకు రాలేనని పేర్కొన్నారు.

అనంతరం తిరిగి ఆయన పులివెందులకు వెళ్లారు. వాస్తవానికి శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లోని తన ఇంటి నుంచి సీబీఐ కార్యాలయానికి అవినాశ్‌రెడ్డి బయల్దేరారని, మార్గమధ్యలో తల్లి ఆస్పత్రిలో చేరినట్లు సమాచారం వచ్చిందని ఆయన తరపు న్యాయవాది మల్లారెడ్డి తెలిపారు.

అవినాశ్ తల్లి గుండెపోటుతో ప్రైవేట్ ఆస్పత్రిలో చేరినట్లు సమాచారం వచ్చిందని చెప్పారు. దీంతో వెంటనే ఆయన పులివెందుల బయల్దేరినట్లు తెలిపారు. దీనిపై సీబీఐకి లిఖితపూర్వకంగా సమాచారం ఇస్తామని, వాళ్లు తీసుకునే నిర్ణయాన్ని బట్టి ఎలా ముందుకెళ్లాలనేది తాము ఆలోచిస్తామన్నారు. తండ్రి భాస్కర్‌రెడ్డి జైల్లో ఉన్నందున తల్లిని అవినాశ్‌రెడ్డే చూసుకోవాల్సి ఉందని న్యాయవాది చెప్పారు.

అకస్మాత్తుగా అస్వస్థతకు గురైన అవినాశ్ తల్లి

అవినాశ్‌రెడ్డి తల్లి శ్రీలక్ష్మి శుక్రవారం మధ్యాహ్నం పులివెందులలోని ఇంటిలోనే అకస్మాత్తుగా అస్వస్థకు గురయ్యారు. విషయం తెలుసుకున్న అవినాశ్‌రెడ్డి, వారి కుటుంబ సభ్యులందరూ పులివెందులలో ఉన్న ఓ ప్రముఖ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ వైద్యులు ఆమెకు ప్రథమ చికిత్స చేసి...వెంటనే కర్నూలు ఆస్పత్రికి తీసుకెళ్లమని సలహా ఇచ్చారు.

దాంతో పులివెందుల నుండి అంబులెన్స్‌లో సాయంత్రం నాలుగు గంటలకు కర్నూలు గాయత్రి ఎస్టేట్‌లోని విశ్వభారతి సర్వజన వైద్యశాలలో చేర్పించారు. హాస్పిటల్ వైద్యులు చెప్పిన ప్రకారం అవినాశ్‌రెడ్డి తల్లికి వైద్య పరీక్షలు జరుగుతున్నాయని, ఆరోగ్యం నిలకడగా ఉందని వారు చెప్పారు. ఆ తర్వాత తల్లిని చూడటానికి వచ్చిన అవినాశ్‌రెడ్డి కూడా ఛాతిలో నొప్పి అని వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రిలో చేరినట్లు పుకార్లు వ్యాపించాయి. ఇక సీబీఐ అధికారులు వాస్తవ పరిస్థితులను పరిశీలించి, దానికనుగుణంగా చర్యలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

వలంటీర్లు సంక్షేమ సారథులు

అవార్డులు ప్రదానం చేసిన సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ప్రజలకు, ప్రజా ప్రభుత్వానికి మధ్య సంక్షేమ సార్యధులు వలంటీర్లేనని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కొనియాడారు. వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని విజయవాడ ఏ ప్లస్ కన్వెన్షన్‌లో శుక్రవారం లాంఛనంగా ప్రారంభించిన సీఎం జగన్... ప్రజలకు ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ తూర్పున సూర్యుడు ఉదయించకముందే ఇంటి తలుపులు తట్టి, చక్కటి చిరునవ్వులతో ప్రతి అవ్వకు, తాతకూ, వితంతువుకు, వికలాంగుడుకు ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్ అందిస్తున్న గొప్ప సేవకులు, సైనికులు మన వలంటీర్లు అని అభినందించారు. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నవరత్నాల అమలు కోసం ప్రభుత్వానికి తోడుగా ఉండేందుకు స్వచ్ఛందంగా పేదలకు సేవ చేయడానికి వచ్చిన 2.66 లక్షల మంది మహా సైన్యమే వలంటీర్ వ్యవస్థ అని ప్రశంసించారు. పేదలకు మంచి చేయాలనే తపన, తాపత్రయంతో దాదాపు 25 సంక్షేమ పథకాలకు లబ్ధిదారులను ఎంపిచేస్తున్నామని, కులం, మతం, వర్గంతో పాటు చివరికి వారు ఏ రాజకీయపార్టీకి ఓటు వేశారన్నది చూడకుండా అర్హత మాత్రమే ప్రామాణికంగా తీసుకుని, ఎక్కడా లంచాలు, వివక్ష చూపకుండా పథకాలు అందిస్తున్నామని, ఇవి అందించడానికి ముందుకొచ్చిన గొప్ప సైన్యం వలంటీర్లని చెప్పారు. ఈ వ్యవస్థ వల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. వైయస్సార్ పెన్షన్ కానుక, బియ్యం కార్డులు, వైయస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులు, అమ్మఒడి, వైయస్సార్ చేయూత, వైయస్సార్ ఆసరా, సున్నావడ్డీ, ఇళ్ల స్థలాలు, ఇళ్ల మంజూరు, జగనన్న తోడు, జగనన్న చేదోడు, వైయస్సార్ రైతు భరోసా, రైతులకు సున్నావడ్డీ, వైయస్సార్ జీవిత బీమా, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, మత్స్యకార భరోసా, వైయస్సార్ నేతన్న నేస్తం, కాపునేస్తం ఇలా... డీబీటీ, నాన్ డీబీటీలోనూ దాదాపు 25 పథకాలకు సంబంధించిన బ్రాండ్ అంబాసిడర్లు వలంటీర్లేనని చెప్పారు. నవరత్నాల పేరుతో వీరి ద్వారా దాదాపు రూ.3 లక్షల కోట్లు ప్రతి అక్కచెల్లెమ్మల గడపకు చేర్చినప్పటికీ ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని విమర్శించారు. ఇక్కడ పనిచేస్తున్న ప్రతి వలంటీర్ స్వచ్ఛందంగా ప్రజలకు మంచి చేయాలనే తాపత్రయంతో అడుగులు వేస్తున్న మంచి మనుషులని కొనియాడారు.

వలంటీర్లను ఉద్దేశించి తాను చేసిన మొదటి ప్రసంగానికనుగుణంగా మిమ్మల్ని నాయకులుగా చేస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు, మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఆదిమూలపు సురేశ్, ప్రభుత్వ విప్ ఉదయభాను, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆర్-5 జోన్‌లో 47,017 ఇళ్లు

(మొదటిపేజీ తరువాయి)

నిర్మాణ శంకుస్థాపన వంటి కార్యక్రమాలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి తాజాగా ప్రతిపాదనలు పంపింది. ఆర్-5 జోన్ పరిధిలో మొత్తం 47,017 ఇళ్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించినట్లు ప్రతిపాదనల్లో పేర్కొంది. వాస్తవానికి గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన మొత్తం 51,392 మందికి ఆర్-5 జోన్‌లో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. అయితే వీటిలో ఇళ్లు కట్టుకోగలిగే వారి కోసం స్థలాలు కేటాయించి, మిగతా వాటిలో తామే ఇళ్లు నిర్మించి ఇచ్చేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం సహకరించాలని కేంద్రాన్ని కోరింది. షీర్‌వాల్ టెక్నాలజీతో ఇళ్లు కట్టాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇళ్ల స్థలాల లేఅవుట్ల అభివృద్ధికి సీఆర్‌డీఏ రూ.50 కోట్లు కేటాయించింది. పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతం చేయడంలో భాగంగా మంత్రులు, ప్రభుత్వంలో కీలకనేతలు, అధికారులు ప్రతిరోజు పనులు పర్యవేక్షిస్తున్నారు.

హైకోర్టు తాత్కాలిక సీజేగా శేషసాయి

కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి నోటిఫికేషన్ జారీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి నియమితులయ్యారు. ఈమేరకు శుక్రవారం కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రజిందర్ కశ్యప్ నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రస్తుత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాకు సుప్రీంకోర్టు జడ్జిగా పదోన్నతి కల్పిస్తూ ఇటీవల కొలిజీయం సిఫార్సు చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో మిశ్రా సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బదిలీపై వెళుతుండడంతో ఆయన స్థానంలో సీజే బాధ్యతలను వెంకట శేషసాయి నిర్వర్తించనున్నారు.

అత్యంత వేగంగా తెలంగాణ అభివృద్ధి

సీఎం కేసీఆర్ మార్గనిర్దేశనంలో దేశానికి మార్గదర్శి : మంత్రి హరీష్ రావు

విశాలాంధ్ర-హైదరాబాద్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వార్షిక రుణ లక్ష్యం రూ.2,42,775 కోట్లుగా నిర్ధారించడం, 13.42 శాతం ఎక్కువగా ఉండటంపై రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు సంతోషం వ్యక్తం చేశారు. ఈ ఏడాది రుణ లక్ష్యంలో ప్రాధాన్యతా రంగం వాటా రూ.1,85,326.68 కోట్లు కాగా ఇందులో అత్యధికంగా 60.85 శాతం అంటే రూ.1,12,762.59 కోట్లు వ్యవసాయ రంగానికి కేటాయించడం మంచి విషయం తెలిపారు. మంత్రి హరీష్ రావు అధ్యక్షతన శుక్రవారం రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ 37వ సమీక్ష సమావేశం టి హబ్‌లో జరిగింది. సమీక్షలో వ్యవసాయ మంత్రి నిరంజన్ రెడ్డితో పాటు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ దేబశిష్ మిత్రా, వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంత్ కె, నాబార్డ్ సీజీఎం చింతల సుశీల, ఆర్‌బీఐ రీజినల్ డైరెక్టర్ నిఖిల, డీఎఫ్ఎస్ అదనపు కమిషనర్ తంగిరాల, అన్ని బ్యాంకుల ప్రతినిధులు, రైతు, చిన్న పరిశ్రమల సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి ప్రణాళికల వల్ల దేశంలోనే తెలంగాణ అత్యంత వేగంగా అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ఎదిగిందని అన్నారు. దేశ జీడీపీకి తెలంగాణ అందిస్తున్న వాటా 2014-15 లో 4.1శాతం ఉంటే, 2022-23లో 4.8 శాతం పెరిగిందని తెలిపారు. రైతు బంధు, 24 గంటల ఉచిత విద్యుత్, మిషన్ కాకతీయ, కాళేశ్వరం సహా ఇతర సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణం, వ్యవసాయ అనుబంధ రంగాలకు ప్రోత్సాహం, ఫిషరీస్, గొర్రెల పంపిణీ తదితర చొరవల వల్ల వ్యవసాయం, అనుబంధ రంగాలు గణనీయమైన వృద్ధి నమోదు చేసినట్లు చెప్పారు.

జస్టిస్ మిశ్రా, విశ్వనాథన్ ప్రమాణం

(మొదటిపేజీ తరువాయి)

ద్రౌపది ముర్ము గురువారం ఆమోదం తెలిపారు. ఇటీవల జస్టిస్ దినేశ్ మహేశ్వరి, జస్టిస్ ఎంఆర్ షా పదవీ విరమణ పొందడంతో సుప్రీంలో జడ్జిల సంఖ్య 32కు తగ్గింది. కొత్తగా ఇద్దరు నియమితులు కావడంతో సంఖ్య తిరిగి 34కు చేరింది. శుక్రవారం ముగ్గురు జడ్జిల చివరి పని దినం కావడంతో న్యాయమూర్తుల సంఖ్య మళ్లీ తగ్గిపోయింది. ఈనెల 22 నుంచి జులై 2వ తేదీ వరకు కోర్టుకు వేసవి సెలవులు ఉంటాయి. ఈ కాలంలో జస్టిస్ కేఎం జోసెఫ్ (జూన్ 16), జస్టిస్ అజయ్ రస్తోగి (జూన్ 17), జస్టిస్ వి.రామసుబ్రమణియన్ (జూన్ 29) పదవీ విరమణ పొందనున్నారు. జస్టిస్ కృష్ణమురారీ జులై 8న రిటైరవుతారు. సుప్రీం న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన విశ్వనాథన్ 2030, ఆగస్టు 11న జస్టిస్ జేబీ పార్దివాలా పదవీ విరమణ అనంతరం భారత ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టి 2031, మే 25 వరకు ఆ పదవిలో కొనసాగతారు.

జస్టిస్ మిశ్రా: చత్తీస్‌గఢ్‌కు చెందిన జస్టిస్ మిశ్రా ఆ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా 13 ఏళ్లు పనిచేశారు. దేశంలోని హైకోర్టు జడ్జిల సీనియారిటీ జాబితాలో 21వ స్థానంలో ఉన్నారు. 2021,అక్టోబరు13 నుంచి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వహించారు.

జస్టిస్ విశ్వనాథన్: తమిళనాడుకు చెందిన జస్టిస్ విశ్వనాథన్ బార్ కౌన్సిల్ నుంచి సుప్రీంకోర్టు జడ్జి స్థాయికి ఎదిగారు. సీనియార్టీ ప్రకారం 2030లో 58వ సీజేఐగా నియమితులై తొమ్మిది నెలలకుగాపైగా ఆ పదవిలో ఉంటారు. న్యాయవాదిగా విస్తృత కేసులు వాదించిన విశ్వనాథన్, స్వలింగ వివాహాలకు చట్టబద్ధతపైనా ఇటీవల పిటిషనర్ల తరపున వాదనలు వినిపించారు. ఈయన 1966, మే 26న జన్మించారు. బార్ నుంచి సుప్రీంకోర్టు బెంచికి నేరుగా పదోన్నతి పొందిన జస్టిస్ ఎస్ఎం సిక్రీ భారత తొలి ప్రధాన న్యాయమూర్తి కాగా రెండో, మూడో స్థానాల్లో జస్టిస్ యూయూ లలిత్, జస్టిస్ పీఎస్ నరసింహా నిలిచారు.

మీ దౌర్జన్యాలు, అక్రమాలు సాగవు

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడికి ముప్పాళ్ల హెచ్చరిక

విశాలాంధ్రబ్యూరో-పల్నాడు జిల్లా: పల్నాడు జిల్లా వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు నాలుగేళ్లుగా దౌర్జన్యాలకు, అక్రమాలకు పాల్పడుతున్నారని, ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయిస్తూ ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు తీవ్రస్థాయిలో విమర్శించారు. నరసరావుపేటలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా కార్యదర్శి మారుతీవరప్రసాద్, సహాయ కార్యదర్శులు షేక్ హుస్సేన్, కాసా రాంబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉలవలపూడి రాము, బూదాల శ్రీనివాసరావుతో కలిసి ముప్పాళ్ల శుక్రవారం మాట్లాడారు. వినుకొండలో 18 సంవత్సరాల క్రితం ఖాళీ భూములలో ఇళ్లు నిర్మించుకొని నివసిస్తున్న పేద ముస్లిం మైనారిటీ, దళిత, గిరిజన, బలహీన వర్గాలకు సీపీఐ చేదోడుగా నిలిచిందని ముప్పాళ్ల చెప్పారు. వక్ఫ్ బోర్డుకు చెందిన ఈ భూములు 40 సంవత్సరాల క్రితం ముత్తవలీలు అమ్ముకొనగా వారి నుంచి చేతులు మారుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతిలో ఉన్న సంగతి వినుకొండ ప్రజలందరికి తెలుసని చెప్పారు. 2006 నుంచి రెక్కల కష్టంతో బతుకుతూ....అప్పోసాప్పో చేసి పక్కా ఇళ్లు నిర్మంచుకుంటే ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆ ఇళ్లు కూల్చివేయిస్తానని పదేపదే బెదిరించడం సరికాదన్నారు. రెండేళ్లకు పైగా వారి ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిపివేశారని, మంచినీరు ట్యాంకులు పంపకుండా వేలాదిమంది ప్రజల ఉసురుపోసుకుంటున్నారని ఆగ్రహం వెలిబుచ్చారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణపై అవాకులు చెవాకులు మాట్లాడే నైతికత బ్రహ్మనాయుడుకు లేదని ముప్పాళ్ల హెచ్చరించారు. పేదల పక్షాన ప్రశ్నించే హక్కు, వారికి న్యాయం జరిగే వరకు పోరాడే శక్తి రామకృష్ణకు, తమ పార్టీకి ఉందని, సీపీఐపైనా, పార్టీ నాయకులపైనా నోరుపారేసుకుంటే తగిన బుద్ధి చెబుతామని స్పష్టంచేవారు. వినుకొండలో సీపీఐ ఒక్క వార్డు కూడా గెలువలేదని పేర్కొన్న బ్రహ్మనాయుడు... 2009లో వినుకొండలో పోటీ చేసి ఘోరంగా ఓడిపోయారని, 2014లో పెదకూరపాడు నుంచి పోటీ చేసి మరోసారి ఓడిపోయిన విషయం గుర్తులేదా అని బ్రహ్మనాయుడును ప్రశ్నించారు. మూడుసార్లు సర్పంచ్‌గా ఉన్న సంద్రపాటి సైదాపై నోరు పారేసుకోవడం మంచిది కాదని హితవు పలికారు. వినుకొండ మీ అబ్బ జాగీరు కాదన్నారు. 'నీ కుటుంబం ఉండేది నరసరావుపేటలో. నీ వ్యాపార కేంద్రం నరసరావుపేట. వినుకొండ చరిత్ర తెలియని నీవు హిందూ, ముస్లింల మధ్య తగాదా పెట్టాలనుకుంటే సాధ్యం కాదు. వారు చాలా చైతన్యవంతులు. నీ కుట్రలు ఇక్కడ సాగవు' అని స్పష్టంచేశారు. రైతు బాధలు చెప్పడానికి ప్రయత్నించిన నరేంద్ర అనే రైతుపై చెప్పు తీసుకుని దాడి చేయబోయావని, రైతుపై హత్యానేరం మోపి జైలులో పెట్టించిన నీకు ఎమ్మెల్యేగా కొనసాగే హక్కు ఉందా అని ప్రశ్నించారు. అజాద్ నగర్‌లో నివశిస్తున్న పేదల పక్షమా... లేక ఆ భూములు రిజిస్ట్రేషన్ పొంది నీ చుట్టూ తిరుగుతున్న రియల్ ఎస్టేట్ పక్షమో నిర్ణయించుకోమన్నారు. 2008లో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఈ విషయంలో జోక్యం చేసుకుని రియల్టర్‌లకు వ్యతిరేకంగా పేదలకు అనుకూలంగా కలెక్టర్‌కు చెప్పి వాస్తవ నివేదికను కోరిన విషయం తెలియదా అని ప్రశ్నించారు.

మారుతీవరప్రసాద్ మాట్లాడుతూ వినుకొండ బ్రహ్మనాయుడు జాగీరు కాదని, ఇక్కడ మాట్లాడటానికి రామకృష్ణ, ముప్పాళ్ల నాగేశ్వరరావు ఎవరు అని ప్రశ్నించడానికి మీకు హక్కు లేదని చెప్పారు. జగనన్న కాలనీకి ఇచ్చిన భూములు ఎకరా రూ.4 లక్షలకు కొని రూ.18 లక్షలకు అమ్ముకున్న నీవు నీతిమంతుడివా అని నిలదీశారు. తమ మంచితనాన్ని అలుసుగా భావిస్తే సహించేది లేదన్నారు. పేదల పక్షాన ఎక్కడైనా నిలబడతామని తేల్చిచెప్పారు. సమావేశంలో ఉప్పలపాటి రంగయ్య, వైదన వెంకట్ పాల్గొన్నారు.

డిసెంబరు లేదా జనవరిలో ఎన్నికలు

ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

విశాలాంధ్ర-పార్వతీపురం : డిసెంబరు లేదా జనవరి నెలలో ఎన్నికలు జరుగుతాయని, మరో 30 ఏళ్లు జగనే మన సీఎం అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర తెలిపారు. శుక్రవారం పార్వతీపురం ఎమ్మెల్యే అలజింగి జోగారావు క్యాంప్ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో 14 ఏళ్లు సీఎంగా చేసిన చంద్రబాబు కంటే నాలుగేళ్లుగా సీఎంగా చేస్తున్న జగన్ పరిపాలన దేశంలో అందరికీ ఆదర్శమని చెప్పారు. సిట్ ఏర్పాటు తర్వాత ప్రతిపక్ష నేత చంద్రబాబులో భయాందోళన పెరిగిందని అన్నారు. ముఖ్యమంత్రి జగన్ చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేక చంద్రబాబు అండ్ కో రకరకాలుగా మాట్లాడుతున్నారన్నారు. రాష్ట్రంలో 17 వేల జగనన్న కాలనీలు ఏర్పాటు చేసిన ఘనత, 70 వేల ఎకరాలు ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన ఘనత, 31 లక్షల ఇళ్లు నిర్మించిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. గత ప్రభుత్వంలో మంజూరు చేసిన గిరిజన విశ్వవిద్యాలయాన్ని పాచిపెంటలో పెట్టమని తాను కోరగా, గిరిజనులు, గిరిజన ప్రాంతాలు లేని ఎస్.కోటలో ఏర్పాటు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. జూన్‌లో సాలూరు నియోజకవర్గానికి ముఖ్యమంత్రి విచ్చేసి ఈ విశ్వవిద్యాలయాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ చిన్న శ్రీను, పార్వతీపురం, పాలకొండ ఎమ్మెల్యేలు జోగారావు, కళావతి, ఎమ్మెల్సీలు పాలవలస విక్రమ్, ఇందుకూరి రఘురాజు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు, పార్వతీపురం నియోజక వర్గ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎగువభద్ర వద్దు

రాయలసీమ హక్కుల సాధన కోసం త్వరలో చలో ఢిల్లీ

బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి

విశాలాంధ్ర-నంద్యాల: కర్నాటకలో ఎగువభద్ర డ్యామ్ నిర్మాణం రాయలసీమకు ఉరితాడులాంటిదని రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి అన్నారు. తుంగభద్ర డ్యామ్‌లో పూడికల వల్ల కర్నాటక, తెలంగాణలో కొన్ని ప్రాంతాలతో పాటు రాయలసీమలోని నాలుగు జిల్లాల ప్రజలు నష్టపోతారని తెలిపారు. శుక్రవారం నంద్యాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సంగమేశ్వరం వద్ద తీగెల వంతెనకు బదులు బ్రిడ్జి కమ్ బ్యారేజ్ కట్టాలని రాయలసీమ నాయకులు కోరకపోవడం దురదృష్టకరమన్నారు. తీగెల వంతెన కేవలం సెల్ఫీలు, సినిమా షూటింగులకు పనికి వస్తుందని, బ్యారేజి నిర్మిస్తే 60 టీఎంసీల నీరు నిలువ చేసుకోవచ్చని, తద్వార రాయలసీమ వాసులకు నీటి సమస్య తీరుతుందన్నారు. రాయలసీమ హక్కుల సాధన కోసం 'చలో ఢిల్లీ'కి పిలుపునిచ్చారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు జై రాయలసీమ నినాదాలు మార్మోగనున్నట్లు ప్రకటించారు. ప్రత్యేక రైళ్లలో వేలాది మందితో ఢిల్లీకి వెళ్లి ర్యాలీ చేపడతామని రెడ్డి చెప్పారు. 52 నియోజకవర్గాల్లో 'సేవ్ రాయలసీమ' పేరుతో సంతకాల సేకరణ చేపట్టగా లక్ష మంది మద్దతు తెలిపారన్నారు. సమావేశంలో స్టీరింగ్ కమిటీ సభ్యులు నవీన్‌కుమార్, రమణా రెడ్డి, గోపాల్ యాదవ్, నందకుమార్ యాదవ్, శివప్రసాద్ రెడ్డి, బీమవరం రామచంద్రరెడ్డి, మునగాల తూము శివారెడ్డి, శ్రీలక్ష్మి, చెన్నమ్మ పాలొన్నారు.

రూ.12 వేలకు పసుపు కొనుగోలు చేయాలి

దుగ్గిరాల మార్కెట్ యార్డు వద్ద రైతుల ధర్నా

విశాలాంధ్ర-దుగ్గిరాల: తడిసి రంగుమారిన పసుపును మద్దతు ధర రూ.12 వేలకు కొనుగోలు చేయాలని, లేనిపక్షంలో రైతు భరోసా కేంద్రాల వద్ద ధర్నా చేస్తామని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ పసుపు రైతుసంఘం అధ్వర్యంలో గుంటూరు జిల్లా దుగ్గిరాల పసుపు మార్కెట్ యార్డ్ వద్ద శుక్రవారం ధర్నా జరిగింది. కేవీవీ ప్రసాద్‌తో పాటు రేపల్లె మాజీ ఎమ్మెల్యే ముప్పలనేని వెంకట సుబ్బయ్య, ఆంధ్రప్రదేశ్ పసుపు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కౌలు రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో 70 వేల ఎకరాల్లో పసుపు సాగు చేస్తున్నారని, గుంటూరు, కృష్ణా, బాపట్ల, ఎన్టీఆర్, పల్నాడు జిల్లాలలో పసుపు సాగు చేస్తూ ఏడాదికి ఎకరానికి కౌలుతో కలుపుకొని రూ.2.50 లక్షల వరకు ఖర్చు అవుతుందని, విత్తనం, ఎరువులు, పురుగుమందులతో పాటు పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడంతో ట్రాక్టర్ల అద్దెలు, వ్యవసాయ ఖర్చులు పెరిగి సాగు మరింత భారంగా మారిందని నాయకులు చెప్పారు. పసుపు వండి ఆరబెట్టుకునే సమయంలో అకాల వర్షాలు వచ్చాయని, దీనివల్ల పసుపు తడిసి రంగు మారిపోయిందన్నారు. నాణ్యత తగ్గడంతో పాటు కొన్ని ప్రాంతాల్లో కుళ్లిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో పసుపు రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. మార్కెట్‌కు పసుపు వచ్చి రెండు నెలలు అవుతున్నా ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని, సకాలంలో పసుపు కొనుగోలు చేసి ఉంటే ఇంత నష్టం జరిగేది కాదన్నారు. ఉడికించి ఆరబెట్టిన పసుపు తడవకుండా ఉంచడానికి సరైన వసతులు లేవని, కనీసం టార్పాలిన్ పట్టలను సైతం ప్రభుత్వం అందించలేకపోయిందని విమర్శించారు. ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో వ్యాపారులు సిండికేట్‌గా మారి తక్కువ ధరకు కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్దతు ధర రూ.6850 ఉంటే దళారులు మాత్రం రూ.3500 నుంచి రూ.5 వేలకు మించి కొనడం లేదన్నారు. అకాల వర్షాల వల్ల పసుపు తడిసి రంగు మారడం, నాణ్యత తగ్గటంతో కొనే నాధుడే కరువయ్యాడన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నిబంధనలు సడలించి మద్దతు ధరకు పసుపును కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ బాజీ, కార్యదర్శి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, బాపట్ల జిల్లా కార్యవర్గ సభ్యులు గొట్టుముక్కల బాలాజీ, రైతు సంఘం నాయకులు పచ్చల శివాజీ, జాలాది జాన్‌బాబు, కంచర్ల కాశయ్య, గుంటక సాంబిరెడ్డి, కె.విఠల్‌రెడ్డి, ముసునూరు సుహాస్, జవ్వాది సాంబశివరావు, చిన్ని సత్యనారాయణ, తోట వెంకటేశ్వరరావు, గోహర్ జానీ, ఎస్కే కరీముల్లా, రైతుసంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు బాపట్లలో రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం సమావేశం

విశాలాంధ్ర-విజయవాడ: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం 22వ రాష్ట్ర మహాసభ ఆగస్టులో బాపట్ల పట్టణంలో జరుగనుంది. మహాసభ ప్రారంభం రోజున'కూలిదండు' మహాప్రదర్శన జయప్రదం చేసేందుకు, ప్రతినిధుల ఎంపికకు సంబంధించి జూన్, జులై మాసాలలో చేపట్టే కార్యక్రమాలపై చర్చించేందుకు ఆదివారం సమావేశం కానున్నట్లు రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21వ తేదీ ఉదయం 11 గంటలకు బాపట్లలోని పూర్ణా ఫంక్షన్ హాల్‌లో ఈ సమావేశంలో జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర మహాసభకు సమాయత్తం, సంఘం సభ్యత్వం చేర్పింపు, నియోజకవర్గ, జిల్లా మహాసభలు పూర్తి, ఆగస్టులో సాగు భూములు, సామాజిక న్యాయం కోసం జరిగే రాష్ట్ర మహాసభ నిర్వహణ గురించి చర్చిస్తామని శేఖర్ వెల్లడించారు.

రైతు నష్టాలపై రౌండ్‌టేబుల్ 24కు వాయిదా

విశాలాంధ్ర-విజయవాడ: అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని, అన్ని పంటలకు బీమా పథకం వర్తింపజేసి పరిహారం ఇప్పించాలని, రబీ ధాన్యం మొత్తాన్ని కొనుగోలు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్వర్యంలో విజయవాడలో ఈ నెల 22వ తేదీన జరగాల్సిన రౌండ్ టేబుల్ సమావేశం 24వ తేదీకి వాయిదా పడినట్లు ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రౌండ్‌టేబుల్ సమావేశం మే 24వ తేదీ ఉదయం 10 గంటలకు విజయవాడ దాసరి భవన్‌లో జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశానికి వివిధ రాజకీయ పక్షాలను, రైతు, ప్రజాసంఘాలను ఆహ్వానించామని, రైతు నష్టాలపై జరగనున్న సమావేశాన్ని జయప్రదం చేయాల్సిందిగా రైతాంగాన్ని, ప్రజానీకాన్ని ఆయన కోరారు.

విద్య వైద్యం ప్రైవేటీకరణ

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు విమర్శ

- విద్యార్థి సమాఖ్య శిక్షణ తరగతుల కరపత్రాల విడుదల

విశాలాంధ్ర-విశాఖ: రాష్ట్రంలో, దేశంలో ప్రభుత్వ విద్య, వైద్యం కార్పొరేట్, ప్రైవేటీకరణ వైపు వెళుతోందని, విద్యా వైద్య సీట్లను అంగట్లో సరుకులాగా అమ్ముతున్నారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వి.జాన్సన్ బాబు విమర్శించారు. మే 29, 30, 31 తేదీల్లో అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఉత్తరాంధ్ర విద్యా, వైజ్ఞానిక, సైద్ధాంతిక, రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని కోరుతూ విశాఖ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోదీ నూతన విద్యా విధానం పేరుతో విద్యను కాషాయీకరణ చేస్తున్నారని విమర్శించారు. జాతీయ విద్యా విధానాన్ని ఏఐఎస్ఎఫ్ వ్యతిరేకిస్తోందని అన్నారు. నూతన విద్యా విధానంలో మూడు, నాలుగు, ఐదు తరగతులను విలీనం చేయడం ద్వారా పేద, మధ్య తరగతి, బడుగు, బలహీన వర్గాల పేదలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులు ప్రభుత్వ విద్యకు దూరమయ్యే పరిస్థితి ఉందని అన్నారు. ఇప్పటికే దాదాపుగా 2,650 పాఠశాల విలీనమయ్యాయని చెప్పారు. బాలికల డ్రాపవుట్స్ పెరిగాయన్నారు. నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలన్నారు. రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం... ప్రభుత్వ విద్యకు పెద్దపీట వేస్తానని కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత మాట మార్చారని అన్నారు. విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయలేదని, పీహెచ్‌డీ, ఎంఫిల్ విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు, ఫెలోషిప్‌లు విద్యార్థులకు అందించడం లేదని అన్నారు. విశ్వవిద్యాలయాలకు నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. ల్యాబ్‌లు, లైబ్రరీలు, హాస్టళ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. రాష్ట్రంలో విద్యా సంవత్సరం ప్రారంభం కాకమునుపే కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు ముందస్తు అడ్మిషన్లు, అధిక ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం అమ్మకాలు నిర్వహిస్తూ నిబంధనలకు వ్యతిరేకంగా అపార్ట్‌మెంట్‌లలో కళాశాలలు, స్కూళ్లు నడుపుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడా చర్యలు తీసుకోవడం లేదని ఆయన విమర్శించారు. అధికారులు ముడుపులకు కక్కుర్తి పడుతున్నారని, విచ్చలవిడిగా అనుమతులు ఇస్తున్నారని తెలిపారు. ఒక అనుమతి ఉంటే నాలుగు, మూడు స్కూళ్లు నడుపుతున్నారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను ర్యాంకుల పేరుతో కాంపిటీషన్ పెడుతూ మోసం చేస్తున్నారని అన్నారు. తక్షణమే నిబంధనలు పాటించని కార్పొరేట్ చైతన్య, నారాయణ విద్యాసంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. విద్యా హక్కు చట్టాన్ని ఈ సంవత్సరమైనా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశాల పైన ఈ తరగతుల్లో చర్చించి భవిష్యత్తు కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాజు, నాయకులు శేఖర్, నాయుడు, భారత్, సింహాచలం పాల్గొన్నారు.

సహజ వనరుల్ని దోచేస్తున్న నేతలు

ఈశ్వరయ్య విమర్శ

విశాలాంధ్ర-సుండుపల్లె: ఆంధ్రప్రదేశ్‌లో సహజ వనరులు దోపిడీ జరుగుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య విమర్శించారు. ప్రజాప్రతినిధులు అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తూ ధనలాభం కోసం పాకులాడు తున్నారని దుయ్యబట్టారు. మట్టి, ఇసుక, ఎర్రచందనం వంటి సహజ వనరులను కొట్టడమే నాయకులు లక్ష్యంగా పెట్టుకున్నారని వ్యాఖ్యానిం చారు. ఈశ్వరయ్య శుక్రవారం అన్నమయ్య జిల్లా, సుండుపల్లెలో ఏర్పాటు చేసిన విలేకురుల సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ నాయకుల తీరును విమర్శించారు. రాజంపేటలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. అన్నమయ్య, పింఛ ప్రాజె క్టులను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సాగునీరు ఇవ్వాలని, ఝరికోన ప్రాజెక్టు నుంచి సుండుపల్లి మండలంలోని రైతులకు సాగునీటిని అందించేందుకు కాలువలు తవ్వాలని డిమాండ్ చేశారు. టీడీపీ హాయంలో సుమారు 250 పైచిలుకు పల్లెలకు తాగునీటి అందించేందుకు రోళ్లమడుగు మంచినీటి పథకం ప్రణాళికలు సిద్ధం చేసి శంకుస్థాపన చేసిన దాని గురించి మరిచారా అని ప్రశ్నించారు. కోట్లాది రూపా యలు వెచ్చించిన పైప్‌లైన్‌ల పనులు అర్థాంతరంగా ఆగిపోవడాన్ని ఈశ్వరయ్య గుర్తుచేశారు సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నరసిం హులు, సహాయ కార్యదర్శి మహేశ్, గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు విశ్వనాథ నాయక్, అఖిల భారత విద్యార్థి సమాఖ్య జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు, అఖిలభారత యువజన సమాఖ్య మండల అధ్యక్షుడు అరుణ్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలు, గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపండి

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కమిషనర్ రవి ప్రకాశ్

విశాలాంధ్ర-విజయవాడ: మాదకద్రవ్యాలు, గంజాయి రవాణా అరికట్టడానికి తగిన చర్యలు చేపట్టాలని, అంతర్ రాష్ట్ర సరిహద్దుల వద్ద వాహనాల తనిఖీ ముమ్మరం చేయాలని, పదే పదే నేరాలకు పాల్పడుతున్న వారిపై పీడీ చట్టం ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కమిషనర్ ఎం.రవి ప్రకాశ్ ఆదేశించారు. మంగళగిరిలో గురు, శుక్రవారాలలో జోన్-1, జోన్-2 శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరు సీతారామ రాజు, కాకినాడ, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, ఏలూరు, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. 23, 24 తేదీలలో జోన్-3, జోన్-4 జిల్లాల అధికారులతో సమీక్షా సమావేశం జరుగుతుందని చెప్పారు. ఎర్రచందనం నియంత్రణపై

కూడా సమీక్ష ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులకు కొన్ని ముఖ్యమైన సూచనలు చేశారు. నాటు సారా, సుంకం చెల్లించని మద్యాన్ని అరికట్టడానికి అన్ని జిల్లాల్లో విస్తృత దాడులు నిర్వహించాలని అన్నారు. పెండింగ్ కేసులను త్వరగా దర్యాప్తు పూర్తి చేసి కోర్టుల్లో ఛార్జ్‌షీట్ దాఖలు చేయాలని చెప్పారు. సారా పూర్తిగా నిర్మూలించబడిన గ్రామాలలో తిరిగి నేరాలు జరగకుండా కట్టుదిట్టం చేసి, నిరతరం నిఘా పెట్టాలని ఆదేశించారు. ఇండస్ట్రియల్ ఆల్కహాల్ వినియోగిస్తున్న పరిశ్రమలను తనిఖీ చేసి, తగిన భద్రతా ప్రమాణాలు పాటించేలా వాటి యాజమాన్యాలకు సూచనలు ఇవ్వాలన్నారు. ఎక్సైజ్ నేరాలలో పట్టుకున్న వాహనాలను త్వరగా జప్తు చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సారా తయారీ, గంజాయి సాగు వంటి నేరాలకు పాల్పడుతున్న కుటుంబాలును గుర్తించి వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని, వివిధ శాఖల సమన్వయంతో నేరాలకు పాల్పడిన వారిని మళ్లీ పాల్పడకుండా తగిన అవగాహన కల్పించాలని కోరారు. ఎలాంటి లైసెన్సు, అనుమతి లేకుండా మత్తు పదార్థాలు అమ్మే వారిపై తప్పనిసరిగా చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సారా, సుంకం చెల్లించని మద్యం, మాదక ద్రవ్యాల నిరోధక చట్టం క్రింద ముద్దాయిలుగా గుర్తింపు పొందిన వారిపై నేర చరిత్ర పత్రాలను రూపొందించి, వారిపై తగిన నిఘా ఉంచాలన్నారు. నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్ ఉన్న ముద్దాయిలను, ఆ రాష్ట్ర పోలీసు వారి సాయంతో త్వరితగతిన కోర్టులో హాజరుపరచాలని సూచించారు. అన్ని కళాశాలలు, విద్యా సంస్థలు, విశ్వ విద్యాలయాల దగ్గర ఉన్న కిరాణా, పాన్ దుకాణాల్లో గంజాయి, మాదక ద్రవ్యాల విక్రయాలు లేకుండా నిరోధించటానికి తగిన నిఘా చర్యలు చేపట్టాలని తెలిపారు. వాటివల్ల కలిగే దుష్ప్రభావాలు, శిక్షలను వివరిస్తూ, అన్ని విద్యా సంస్థలు, ముఖ్య ప్రదేశాలలో 'డ్రగ్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్' అనే హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. జూదం, పేకాట, ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, కోడిపందేలు, మట్కా వంటి గేమింగ్ చట్టం కింద వచ్చే నేరాల పట్ల కఠిన చర్యలు చేపట్టాలని చెప్పారు. విద్యార్థులు మాదకద్రవ్యాల వినియోగం కేసులలో తొలి సారిగా పట్టుబడితే వారికి వారి తల్లిదండ్రుల సమక్షంలో తగిన కౌన్సెలింగ్ ఇచ్చి వారు సరైన మార్గంలో ఉండేలా సూచించాలన్నారు. మహిళా పోలీసులు సారా, గంజాయి, పేకాట వంటి నేరాలకు సంబంధించిన సమాచారం సేకరించటంలో నిరాటంకంగా పని చేయాలని కోరారు. ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా సెట్ అధికారులు పని చేయాలని, ఎటువంటి నిర్లిప్తత, నిర్లక్ష్యం కలిగి ఉండరాదని అన్నారు.

ఆర్-5 జోన్‌లో ఇళ్ల పట్టాలివ్వటాన్ని అడ్డుకుంటాం

జడ శ్రావణ్ కుమార్

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): అమరావతిని విచ్ఛిన్నం చేయటమే లక్ష్యంగా సీఎం జగన్ పని చేస్తున్నారని జై భీమ్ భారత్ పార్టీ వ్యవస్థాపకులు జడ శ్రావణ్ కుమార్ అన్నారు. శుక్రవారం గాంధీనగర్‌లోని తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్-5 జోన్‌లో ఇళ్ల పట్టాలివ్వటాన్ని అడ్డుకుంటామన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులు త్యాగం చేసి ఇచ్చిన భూమిని వేరే వారికి ఎలా ఇస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆర్-5 జోన్ అంశంలో అమరావతి రైతులకు నిరాశే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలపై జగన్ ప్రేమ ధృతరాష్ట్ర కౌగిలిలాగా ఉందన్నారు. నిజంగానే పేదలపై ప్రభుత్వానికి ప్రేమ ఉందనుకుంటే పొరపాటన్నారు. 2014లో అమరావతి రాష్ట్ర రాజధాని అని గత ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నప్పుడు మూడు పంటలు పండే భూములను రైతులు ఇచ్చారన్నారు. గత ప్రభుత్వం సీఆర్డీఏ చట్టాన్ని తయారు చేసి రైతులకు భరోసా ఇస్తూ ఒప్పందం ప్రకారం భూములు తీసుకుందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం సీఆర్డీఏ ఒప్పందాలను తుంగలో తొక్కుతూ రైతులను మోసం చేసిందన్నారు. భూములు ఇచ్చిన రైతులపై జగన్ ప్రభుత్వం లాఠీ ఝుళిపించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు టీడీపీ పార్టీ పేరును అంటగట్టి కక్ష సాధింపుగా జగన్ ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. సైనికుడు దేశానికి రక్షణగా ఉంటే, రైతు ప్రజల ఆకలి తీర్చే మరో సైనికుడు అని అన్నారు. కొంతమంది పేటీఎం గాళ్లు అమరావతి రైతులపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర రాజధాని కోసం భూములు ఇవ్వడం రైతులు చేసిన పాపమా అని నిలదీశారు. రాష్ట్ర అభివృద్ధి కోసం జగన్, ఆయ న అనుచరులను భూములు ఇవ్వాలని అన్నారు. అమరా వతిలో పేద వాడికి సెంటు స్థలం అం టూ దళితుల మధ్య చిచ్చుపెట్టేందుకు ఈ ప్రభుత్వం పూనుకుందన్నారు. అమరావతి అభివృద్ధిలో భాగంగా నవ నగరాలు నిర్మించాలని గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. రాజధానిలో 36 వేల ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీ, ఎలక్ట్రానిక్ సిటీ, ఫైనాన్స్ సిటీ, హెల్త్ సిటీ, టూరిజం సిటీ లాంటివి నిర్మించాలని మాస్టర్ ప్లాన్ గత ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, మాస్టర్ ప్లాన్ ప్రకారం నవ నగరాలు నిర్మిస్తే టీడీపీకి పేరొస్తుందన్న అక్కసుతో రాజధానిని ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. అమరావతి రాజధానిలో ఏమి అభివృద్ధి చేశావని జగన్‌ను ప్రశ్నించారు. గత ప్రభుత్వం సెక్రటేరియట్‌లో జగన్ పాలన సాగించడంలేదా, గత ప్రభుత్వం వేసిన రోడ్లపై నడవడం లేదా అని నిలదీశారు. అసలు తల్లి, చెల్లి కూడా ముఖ్యమంత్రి జగన్‌ను నమ్మడం లేదన్నారు. రైతులు ఉన్న ఆస్తులు తాకట్టు పెట్టి న్యాయస్థానంలో పోరాటం చేస్తున్నారని అన్నారు. రైతుల కోసం క్షేత్రస్థాయిలో పోరాటం చేసేందుకు రాజకీయ పార్టీలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అమరావతి ఉద్యమ పోరాటం కేవలం రైతులది మాత్రమే కాదని, 5 కోట్ల ఆంధ్రులదని అన్నారు.

కార్మిక, కర్షక ఐక్యతతో బలమైన ఉద్యమాలు

పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభలో శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కార్మిక, కర్షక ఐక్యతతో రాజకీయ అధికారం నుండి పెట్టుబడిదారీ వర్గాన్ని కూలదోసి సోషలిజాన్ని నిర్మిస్తేనే మానవులకు విముక్తి లభిస్తుందని కామ్రేడ్ సుందరయ్య బలంగా విశ్వసించారని, అందుకోసం ఆయన జీవితాంతం పోరాడారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. అందులో భాగంగానే జమీందారీ, తెలంగాణ సాయుధ పోరాటం, కూలి పోరాటాలు, భూపోరాటాల వంటి వాటికి ఆయన నాయకత్వం వహించారన్నారు. కూలి పోరాటాల ద్వారా వ్యవసాయ కార్మికులకు సంఘం ఏర్పాటు చేసి గ్రామాల్లో స్వయంగా తిరిగి భారతదేశ సమాజాన్ని నిర్దిష్టంగా అధ్యయనం, వర్గ విశ్లేషణ చేసి కార్మిక, కర్షక ఐక్యతను ఎలా నిర్మించాలో చూపారన్నారు. అలాంటి నాయకుడిని ఆదర్శంగా తీసుకుని బలమైన కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించడానికి సమాయత్తం కావాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి సభలో ఆయన ప్రసంగించారు. రాజకీయ వేత్తలు, రాజకీయాలు ఎలా ఉండాలో నిలువెత్తు నిదర్శనంగా సుందరయ్య నిలుస్తారని కొనియాడారు. ప్రస్తుతం ఎన్నికలు, రాజకీయాలు అంటే పదవులు, డబ్బు అనేలా మారిపోయాయని, అన్ని రంగాల కంటే ఎక్కువ లాభదాయకమైన కార్పొరేట్ బిజినెస్ మోడల్‌గా రాజకీయాల్ని మార్చేశారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్తుల్ని, ప్రభుత్వ రంగాన్ని ఇష్టమొచ్చినట్టు దోచుకోవడానికి వాడుకుంటున్నారన్నారు. ఇలాంటి దశలో వేగుచుక్కలా కమ్యూనిస్టు పార్టీలే రాజకీయ విలువల్ని కాపాడుతున్నాయన్నారు. సీపీఎం సీనియర్ నాయకులు పి.మధు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం విద్యుత్ మీటర్లు పెట్టి రైతులను నిలువు దోపిడీ చేయడానికి చూస్తున్నదని, దేశంలోనే విద్యుత్‌మీటర్లు పెట్టిన మొదటి రాష్ట్రం మనదేనన్నారు. ఈ మీటర్ల పేరుతో అదానీకి వేల కోట్లు కట్టబెడుతున్నారన్నారు. సుందరయ్య స్ఫూర్తితో రైతాంగంపై జరుగుతున్న దాడిని తిప్పికొట్టాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సుందరయ్య క్రమశిక్షణకు మారుపేరన్నారు. తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా వ్యక్తం చేసేవారన్నారు. జయరాం అధ్యక్షతన జరిగిన ఈ సభలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు కె.ధనలక్ష్మి, బీఆర్ తులసీరావు మాట్లాడారు.

సంపాదకీయం

కదిలి వచ్చిన సిక్కులు

ఇరవై ఆరు రోజులుగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో దేశ గౌరవానికి వన్నె తెచ్చిన భారత మహిళా మల్ల యోధులు, వీరికి మద్దతుగా మరికొంతమంది క్రీడాకారులు దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన చేస్తున్నారు. మహిళా క్రీడాకారులను లైంగిక వేధింపులకు గురి చేశాడన్న బీజేపీ ఎంపీ, భారత మల్ల యోధుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ తన పదవికి రాజీనామా చేయలేదు. క్రీడాకారులు సుప్రీంకోర్టును ఆశ్రయిస్తే తప్ప ఆయన మీద ఎఫ్.ఐ.ఆర్. నమోదు కాలేదు. చివరకు ఆయన మీద రెండు కేసులు నమోదయ్యాయి. అందులో ఒకటి ఈడు రాని క్రీడాకారిణిని లైంగికంగా వేధించాడన్న ఆరోపణలు ఎదుర్కుంటున్నందువల్ల పోస్కో కింద కేసు నమోదైంది. పోస్కో కేసు నమోదైతే 24 గంటల లోగా అరెస్టు చేయాలి. కానీ ఆయనకు బీజేపీ అగ్ర నాయకుల అండదండలున్నాయి కనక ఈగైనా వాల లేదు. గురు, శుక్రవారాల్లో క్రీడాకారులకు మద్దతుగా వేలాది మంది సిక్కులు తరలి వచ్చారు. ఈ ఉద్యమం ప్రారంభం అయిన దగ్గరనుంచి అనేక రాజకీయ పార్టీల వారు మద్దతు తెలుపుతూనే ఉన్నారు. భీం ఆర్మీ నాయకుడు చంద్రశేఖర్ ఆజాద్ కూడా మద్దతు ప్రకటించారు. ఆయన నిరసన శిబిరం దగ్గరకు శుక్రవారం కూడా వచ్చారు. నిరసన ప్రదర్శన చేస్తున్న వారు గురువారం హనుమాన్ దేవాలయాన్ని, శుక్రవారం బంగ్లా సాహెబ్ గురుద్వారా సందర్శించారు. భగవంతుడి ఆశీర్వాదాలు తమకుంటే ఉద్యమం సఫలమవుతుందన్నది వారి విశ్వాసం. బ్రిజ్ భూషణ్‌ను ప్రభుత్వం అరెస్టు చేయలేకపోతే తామె నిర్బంధిస్తామని, శిక్షిస్తామని ఈ సిక్కు నాయకులు ప్రతినబూనారు. బ్రిజ్ భూషణ్‌ను ఎడ్లకు కట్టి లాక్కెళ్లిపోతామంటున్నారు. అమ్మాయిల ఆత్మ గౌరవమే అత్యంత ప్రధానమైందని, ఎవరూ దీనికి భంగం కలిగించకుండా చూసుకుంటామని సిక్కుల ప్రతినిధులు తెలియజేశారు. కుల మతాలతో సంబంధం లేకుండా నిరుపేద కూతురి ఆత్మ గౌరవానికి భంగం కలిగినా సిక్కు మతస్థులు వారికి అండగా నిలుస్తారని వారి ప్రతినిధి ఒకరు చెప్పారు. ప్రతి అమ్మాయికి ఆత్మ గౌరవం, మాన రక్షణ అత్యవసరమని, వారు పెళ్లిళ్ల చేసుకుని కాపురాలకెళ్లాలి. ఇదే సమాజంలో బతకాలి కనక వారి ఆత్మ గౌరవం తమకు అత్యంత ప్రధానమైందని సిక్కులు అంటున్నారు. ఈ పోరాటంలో కుల మతాల ప్రస్తావన లేదని అందరి గౌరవం తమకు ఒక్కటేనని వారు చెప్తున్నారు. బ్రిజ్ భూషణ్ చేతుల్లో లైంగిక వేధింపులకు గురైన అమ్మాయిలు తాము వేధింపులకు గురయ్యామని చెప్పడమే అపూర్వం. సాధారణంగా అత్యాచారాలకు, లైంగిక వేధింపులకు గురైన ఆడవారు ఆ మాట బయటకు చెప్పడానికి వెనుకాడతారు. ఎంతటి విధిలేని పరిస్థితి ఉంటే ఈ అమ్మాయిలు రోడ్డెక్కి నినదిస్తున్నారో అర్థం చేసుకోగలిగిన సంస్కారం, హృదయం మోదీ సర్కారుకు లేదని ఇన్నాళ్లుగా రుజువైంది. ప్రభుత్వం చట్టాన్ని అమలు చేయనప్పుడు ప్రజలే చట్టాన్ని అమలు చేయించవలసిన పరిస్థితి వస్తుంది. ఇది సమర్థించదగిన పరిణామం కాదు గానీ ప్రభుత్వం ఏ మాత్రం కదలనప్పుడు మార్గాంతరం లేదు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకున్నా ప్రభుత్వం మౌనంగా ఉండడంలో సంకుచిత ప్రయోజనాలను పరిరక్షించడం, తమ వారు ఏం చేసినా వెనకేసుకు రావాలన్న దుగ్ధ తప్ప మరేమీ కనిపించడం లేదు. బ్రిజ్ భూషణ్‌ను కాపాడుతున్నది కేంద్ర ప్రభుత్వం, ప్రధానంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్న విషయం అందరికీ తెలుసు.

న్యాయం దక్కేదాకా నిరంతర పోరాటం కొనసాగిస్తామని క్రీడాకారులు గట్టిగా చెప్తున్నారు. బ్రిజ్ భూషణ్ ను వెంటనే అరెస్టు చేసి రెండు నెలల్లోగా విచారణ పూర్తి అయ్యేట్టు చూసి శిక్ష విధించాలన్నదే వీరి కోరిక. ఈ క్రమం వేగవంతం అయ్యేలా చేయడానికే క్రీడాకారులు గురు, శుక్రవారాల్లో వీధుల్లోకి వచ్చి నిరసన తెలియజేయవలసి వచ్చింది. 2019లోనూ అధికారం దక్కించుకున్న మోదీ ప్రభుత్వానికి పూర్తి మెజారిటీ దక్కడంవల్ల అహంకారం తలకెక్కినట్టు రుజువు అవుతూనే ఉంది. మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరన్న అతి విశ్వాసమూ ఉంది. పాలకుల్లో ఇలాంటి ధోరణి ఏర్పడడం, కొనసాగడం దేశంలో ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకరం. ప్రభుత్వ పెద్దలు కర్నాటక శాసనసభ ఎన్నికలలో మునిగి ఉన్నారనుకున్నా ఆ ఎన్నికలు ముగిసి కూడా పది రోజులు గడిచాయి. ఇప్పటికీ మోదీ ప్రభుత్వంలో చలనం లేకపోవడం దుస్సహమైంది. క్రీడాకారులకు మద్దతు ప్రకటించడానికి వచ్చిన సిక్కులు తమకు గౌరవం అత్యంత ప్రధానమైందని, దానికే కొరత ఏర్పడినప్పుడు ఉద్యమించక తప్పడం లేదంటున్నారు. సిక్కుల తొమ్మిదవ గురువు గురు తేజ్ బహదూర్ ఔరంగజేబ్ ఎదుట తల వంచడం ఇష్టంలేక తన ప్రాణాలనే బలిపెట్టాడని నిరసన తెలియజేస్తున్న వారికి మద్దతు ఇవ్వడానికి వచ్చిన సిక్కులు గుర్తు చేస్తున్నారు. ఈ సమస్య త్వరలో పరిష్కారం కాకపోతే ఉద్యమాన్ని దేశంలోని అన్ని ప్రాంతాలకు విస్తరింప చేస్తామని వీరు చెప్తున్నారు. ఏడాదికి పైగా నడిచిన రైతుల ఉద్యమంలో పంజాబ్ రైతులు ప్రధాన పాత్ర పోషించారు. అందులో సహజంగానే సిక్కులే ఎక్కువ మంది. ఆ సమయంలో సిక్కులు ఎంతటి పట్టుదల కనబరిచారో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

రైతు ఉద్యమం సందర్భంగా కూడా మోదీ ప్రభుత్వం ఏడాదికి పైగా అహంకారాన్ని, మంకుతనాన్నే ప్రదర్శించింది. చివరకు ఉద్యమ తీవ్రత, అందులో ఉన్న పట్టుదలకు జడిసి మోదీ లొంగక తప్పలేదు. క్రీడాకారులు ఉద్యమాన్ని నిర్వహిస్తున్న తీరుచూస్తే వారి పట్టుదల కూడా సామాన్యమైంది కాదని రుజువు అవుతోంది. ఈ దేశంలోని రాజ్యాంగబద్ధ సంస్థలపై మోదీకు ఎంతమాత్రం గౌరవం లేదు. ఒక్కొక్క వ్యవస్థ రాయి రాయి విడగొట్టే విచ్ఛిన్నకర ధోరణి అనుసరించడంలో మోదీ అద్వితీయమైన అపకీర్తి మూటగట్టుకున్నారు. ప్రజాభిప్రాయాన్ని ఆయన మన్నించిన సందర్భమే లేదు. రాజ్యాంగాన్ని మనం ఎంత పకడ్బందీగా రూపొందించినా అది ఎలా అమలవుతుందన్నది అమలుచేసే వారి మీదే ఆధారపడి ఉంటుందని, అప్పుడే రాజ్యాంగం వల్ల ప్రయోజనం కనిపిస్తుందని రాజ్యాంగ నిర్మాయక సభ ముగింపు సందర్భంగా అంబేద్కర్ చెప్పిన మాటలను గుర్తుచేసుకోవలసిన దశకు వచ్చాం. మోదీ భావధారకు మూలమైన సంఘ్ పరివార్ రాజ్యాంగ ప్రతులను దగ్ధం చేసిన ఘటననూ గుర్తు చేసుకోవాలి. ఆ కుదురు నుంచి వచ్చిన వ్యక్తికి రాజ్యాంగ నిబద్ధత ఉంటుందని ఆశించలేం. ఏ ప్రజాస్వామ్య పద్ధతుల ఆధారంగా మోదీ అధికారంలోకి వచ్చారో అదే రాజ్యాంగాన్ని బాహాటంగా, నిస్సిగ్గుగా, కసిగా కాలరాస్తున్నారు. ఈ దేశంలో అయిన వారికి ఒక చట్టం, ఇతరులకు మరో చట్టం ఉన్నట్టుగా మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ఒక వర్గం తరవాత మరో వర్గం క్రీడాకారులకు మద్దతిస్తున్న తీరు చూస్తే ఇది బలహీనపడే సూచనే లేదు. రైతు ఉద్యమానికి నాయకత్వం వహించిన రైతు సంఘాలు, నాయకులు కూడా మద్దతిచ్చారు. మొండి పట్టుదల అంతిమంగా మోకరిల్లక తప్పని స్థితికి తీసుకువస్తుంది.

ఇది మల్లెల వేళయనీ...

అవును... ఇది మల్లెల కాలం. మల్లెల మాసం. పూలండోయ్ పూలు... మల్లెపూలు అంటూ సైకిళ్ల వెనుక బుట్టల్లో తెల్లటి మల్లెల్ని నింపుకుని చిరు వ్యాపారులు వీధుల్లో తిరుగాడే కాలం. మల్లెలు కనపడగానే.. ఆ సువాసన ముక్కుని తాకగానే ప్రాణం ఎక్కడికో పోతుంది. మూడు నెలలు మాత్రమే కనిపించే మల్లెపూలకు

ఏడాదంతా గుబాళింపే. పువ్వుల్లో మేనక వంటిది ఈ మల్లె. గుబులు రేపుతుంది. రావులపాలెం నుంచి అలా రాజమండ్రి వరకూ జాతీయ రహదారిపై వెళ్తుంటే మల్లెలు రారమ్మని పిలుస్తాయి. ఆగాల్సిందే. కొనాల్సిందే. భార్యకో, ప్రియురాలికో కాన్కగా ఇవ్వాల్సిందే.

తెలుగు సినిమా పాటల్లో ఈ మల్లెలకే అగ్రతాంబూలం. మల్లెలమీద పాట రాయని సినీకవులు బహుఅరుదు. సినారె తన సినీకవి ప్రయాణంలో తొలి పాటలు మల్లెల మీద రాసారు. అఫ్‌కోర్స్ అందులో విరహ గీతాలూ ఉన్నాయనుకోండి. హీరో ఎన్టీఆర్ తన విరహాన్ని, వేదనని మల్లెపూలతో పంచుకున్నాడు. "మల్లియలారా... మాలికలారా.. మౌనముగా ఉన్నారా.. మా కథనే విన్నారా" అంటారు సినారె. నిజానికి మల్లెలు మౌనంగానే మత్తెక్కిస్తాయి. మౌనంగా మానవుల కథలు వింటాయి. ఏ కథైనా ఆప్తులకే చెప్పుకుంటాం. దేవులపల్లి కృష్ణశాస్త్రి గారైతే మల్లెలకి పరవశించి రాసిన పాటలెన్నో ఉన్నాయి. "ఇది మల్లెల వేళయని... వెన్నెల మాసమని... ముందే కూసిన కోయిలా" అంటూ సుఖదుఃఖాలు కలబోసుకున్నారు. అంతేకాదు...ఈనాటి బంధం ఏనాటిదో సినిమాలో మల్లెలకి, బొండు

చక్రవాకం

\- ముక్కాముల చక్రధర్

మల్లెలకి తేడా కూడా చెప్పారు. ఈ సినిమాలో "ఎవరు నేర్పేరమ్మ... ఈ కొమ్మకు" పాటలో "మల్లెలివి నా తల్లి వరలక్ష్మికి... మొల్లలివి నన్నేలు నా స్వామికి" అంటారు. తాను కొలిచే అమ్మవారికి మల్లెపూలు ఇస్తే తనను ఏలే శ్రీవారికి మొల్లలిచ్చింది హీరోయిన్. మొల్లలంటే బొండు మల్లెపూలు. బ్రహ్మ సృష్టించిన మల్లెలకి విశ్వామిత్రుడు చేసిన ప్రతిసృష్టే బొండు మల్లెలు. విశ్వామిత్ర సృష్టిని దైవ కార్యానికి ఉపయోగించరు. ఆ తేడాని రెండులైన్లలో చెప్పి మల్లెపూల విశిష్టతను కూడా చెప్పారు దేవులపల్లి.

వేటూరి సుందరరామమూర్తి అయితే తనకు అవకాశం వచ్చిన ప్రతీసారీ మల్లెల మీద పాటలు గుప్పించారు. ఇంటింటి రామాయణం సినిమాలో మల్లెలు పూచే... వెన్నెల కాచే... అంటూ మల్లెలకి, వెన్నెలకి ఉన్న బంధాన్ని మరోసారి చూపించారు. చిరంజీవి ఆరాధన సినిమాలో కూడా "తీగనై... మల్లెలూ..." అంటూ ఓ మెచ్యూర్డ్ ప్రేమని మల్లెలతో ముడిపెడుతూ రాసారు. తెలుగు వారి జీవితాల్లోనే కాదు సాంస్కృతిక వారసత్వంలో కూడా మల్లెపూలకి విశేషమైన స్థానం ఉంది.

తెలుగు కథా సాహిత్యంలో కూడా మల్లెపూల గురించిన కథలు చాలానే వచ్చాయి. ప్రముఖ కథకుడు సి.ఎస్.రావు రాసిన మల్లెపూలు కథ చాలా గొప్పకథ. ఓ కామందు తన పూదోటలో విరగబూసిన మల్లెల్ని కోయడానికి కొందరు మహిళలను కూలీలుగా చేర్చుకుంటాడు. వారంతా సాయంత్రం వరకూ మల్లెలుకోసి మార్కెట్‌కి తరలించే వరకూ వొళ్లు వంచి పనిచేస్తారు. ఇంత పని చేసినా వారికి మల్లెపూలు పెట్టుకునే భాగ్యం మాత్రం కలగదు. వారి మల్లెల కోరిక ప్రతిరోజూ వాడిపోతుంది. అలాంటి సమయంలో ఓ మహిళా కూలికి గుప్పెడు మల్లెలు ఇచ్చి ఆమెని లొంగదీసుకుంటాడు ఆ కామందు. ఈ మాత్రానికే స్త్రీలు లొంగిపోతారా అనే ఆలోచన వద్దు. ఆ కారణాలు అలాంటివి. ఇక్కడ మల్లెల విశిష్టత, వాటిపై మహిళలకుండే అనురాగమే ప్రధానం. ఇక అభ్యుదయ రచయిత చా.సోగా ప్రసిద్ధికెక్కిన చాగంటి సోమయాజులు గారు కూడా బొండు మల్లెలు అని కథ రాసారు. ఈ కథలో శ్రమదోపిడీ గురించి చెప్తారు చా.సో. తన ఇంటి పెరట్లో మల్లె పందిరివేసి ఆ పంటను ధనికులకు ఎక్కువ మొత్తానికి విక్రయించాలని ప్రధాన పాత్రధారి ఉద్దేశం. ఇందుకోసం ఓ తాతను పనిలో పెట్టుకుంటాడు. మల్లెపందిరి విస్తారంగా పంట ఇస్తుంది. ఆ యజమానికి కూడా భారీగానే డబ్బులు వస్తాయి. కానీ, ఆ మల్లెతోటకోసం అహర్నిశలు పనిచేసిన తాత మాత్రం డబ్బులులేక, తిండి లేక మరణిస్తాడు. ఇక్కడ సారూప్యం ఏమిటంటే మల్లెలు కూడా సుఖాన్నిఇచ్చి వాడిపోతాయి. పనివాడు తాత అలాంటి మల్లెలకి ప్రతీక.

మరో రచయిత్రి ఇల్లెందుల సరస్వతీదేవి కూడా కొండ మల్లెలు అని ఓ కథ రాసారు. ఇందులో రెండు జంటల జీవితాలను చూపించిన సరస్వతీదేవి అందులో గిరిజన జంటను మల్లెలాంటి మనసులకు ప్రతీకలా చూపించారు. ఇలా మల్లెపూలకి, మనుషులకి ఉన్న అనుబంధం తీరనిది. తీర్చలేనిది. సమయం మించిపోతోంది. ఇక ఎంతోకాలం మల్లెలురావు. ఇప్పుడే పూల మార్కెట్‌కు వెళ్లండి. మల్లెదండ తీసుకొచ్చి శ్రీమతి చేతిలో పెట్టండి. మీరేమడిగినా ఆ స్త్రీ మూర్తి చేసేస్తుంది. స్త్రీలు మెచ్చే, నచ్చే పెద్ద కానుక మల్లెపూలే.

సీనియర్ జర్నలిస్టు, 99120 19929

మణిపూర్ బీజేపీలో తిరుగుబాటు

ఆశిశ్ బిశ్వాస్

కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయిన బీజేపీ ఆ షాక్ నుంచి ఇంకా పూర్తిగా తేరుకోకముందే మణిపూర్ బీజేపీలో తిరుగుబాటు మరో షాక్ ఇస్తోంది. కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ బీజేపీ కష్టకాలాన్ని ఎదుర్కొంటోంది. మణిపూర్‌లో గిరిజన తెగలమధ్య ఈ నెల ప్రారంభంలో తీవ్రమైన కల్లోలమే చోటుచేసుకుంది. సైన్యాన్ని ఇతర పారా మిలిటరీ దళాలను మోహరించి పరిస్థితిని తాత్కాలికంగా అదుపు చేయగలిగారు. ఈ సందర్భంగానే బీజేపీ రాష్ట్ర యూనిట్‌లో గిరిజన ఎంఎల్‌ఏలు ఇంకా వివిధ స్థాయిల్లో నాయకులు, కార్యకర్తలు తిరుగుబాటు చేశారు. బీజేపీ రాష్ట్ర ప్రభుత్వ నిర్వాహకులతో కలిసి తాము పనిచేయబోమని కొంతమంది బీజేపీ గిరిజన ఎంఎల్‌ఏలు ప్రకటించారు. ఇలా ప్రకటించిన ఎంఎల్‌ఏలలో ఏడుగురు కుకి సభ్యులు. ఇటీవల జరిగిన హింసాకాండ జాతుల మధ్య ఘర్షణలు జరిగే సున్నితమైన ప్రాంతంలో విస్తరించింది. ఈ నేపథ్యంలో మిజోరం నుంచి ఎంఎల్‌ఏలు ఒక ప్రకటనచేశారు. విచ్చల విడిగా ఘర్షణలు, హింసాకాండ, హత్యలు జరిగాయి. వేలాదిమంది మెజారిటీ జనాభాగలిగిన మెయిటీలు, కుకీలు, నాగాలు, మిజోలు, హమార్‌లు తదితర గిరిజన తెగలు ఈ ఘర్షణల్లో పాల్గొన్నారు. మెజారిటీ జనాభాఉన్న మెయిటీల పరిస్థితిని పునర్‌నిర్వచించాలని కేంద్రప్రభుత్వాన్ని కోరారు. మెయిటీలు నివసించే ప్రాంతానికి ఎస్‌టీల హోదా ఇవ్వాలని ఇందుకువారికి అర్హతఉందని రాష్ట్రహైకోర్టు తెలిపింది. కేంద్రానికి సిఫారసు చేయాలని కూడా రాష్ట్రప్రభుత్వాన్ని కోరింది. ఆ తరువాతనే రాష్ట్రంలో సైన్యం వస్తేనేగానీ అదుపు చేయలేనంతగా హింసాకాండ చెలరేగింది.

హింసాయుత ఘర్షణల అనంతరం దిల్లీలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాతో కుకీ ఎంఎల్‌ఏలు, నాయకులు సమావేశంలో పాల్గొని నిత్యం హింసాకాండ చెలరేగే పరిస్థితి ఉండకూడదని గిరిజనేతరులతో కలిసితాము జీవించలేమని స్పష్టం చేశారు. మే 3వ తేదీన ప్రజాసమూహాల మధ్య హింసాకాండ చెలరేగి కొన్ని రోజులవరకు ఘర్షణలు సాగాయి. సైన్యం, పారామిలిటరీ దళాలు, స్పెషల్ పోలీసులు వేలాదిమంది రాష్ట్రానికి వచ్చి అదుపు చేయగలిగారు. హైకోర్టు నిర్ణయమే ఈసారి గిరిజనులు, గిరిజనేతరుల మధ్య ఉవ్వెత్తున ఘర్షణలు జరగడానికి తక్షణకారణం. ఇప్పటికే 34 గిరిజనజాతులు ఎస్‌టీ హోదా కలిగిఉన్నాయి. మెజారిటీ

> హింసాయుత ఘర్షణల అనంతరం దిల్లీలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాతో కుకీ ఎంఎల్‌ఏలు, నాయకులు సమావేశంలో పాల్గొని నిత్యం హింసాకాండ చెలరేగే పరిస్థితి ఉండకూడదని గిరిజనేతరులతో కలిసితాము జీవించలేమని స్పష్టం చేశారు. మే 3వ తేదీన ప్రజాసమూహాల మధ్య హింసాకాండ చెలరేగి కొన్ని రోజులవరకు ఘర్షణలు సాగాయి. సైన్యం, పారామిలిటరీ దళాలు, స్పెషల్ పోలీసులు వేలాదిమంది రాష్ట్రానికి వచ్చి అదుపు చేయగలిగారు. హైకోర్టు నిర్ణయమే ఈసారి గిరిజనులు, గిరిజనేతరుల మధ్య ఉవ్వెత్తున ఘర్షణలు జరగడానికి తక్షణకారణం. ఇప్పటికే 34 గిరిజనజాతులు ఎస్‌టీ హోదా కలిగిఉన్నాయి. మెజారిటీ ప్రజలకు ఎస్‌టీ హోదా ఇచ్చినట్లయితే ఆర్థికంగా తాము మరింత దిగజారిపోతామని తమకు ఉన్న హోదా, సౌకర్యాలు తగ్గిపోతాయని గిరిజనులు చెబుతున్నారు.

ప్రజలకు ఎస్‌టీ హోదా ఇచ్చినట్లయితే ఆర్థికంగా తాము మరింత దిగజారిపోతామని తమకు ఉన్న హోదా, సౌకర్యాలు తగ్గిపోతాయని గిరిజనులు చెబుతున్నారు. రాష్ట్రం అనేక సంక్లిష్టమైన సమస్యలను ఎదుర్కొంటున్నప్పటికీ రాష్ట్ర బీజేపీ ప్రభుత్వంగానీ, నాయకులుగానీ, కేంద్ర నాయకులుగానీ వాటిని పట్టించుకోవడంలేదు. అధికారిక పర్యటనలుచేసి తిరిగి వెళ్లిపోతున్నారు. రాష్ట్ర జనాభాలో 53శాతం మంది మెయిటీలు ఉన్నారు. రాష్ట్ర రాజధాని ఇంఫాల్, చుట్టుపక్కలగల లోయల్లో మెయిటీలు ఎక్కువగా ఉన్నారు. మొత్తం ప్రాంతంలో 10శాతం ప్రాంతంలో మెయిటీలే నివసిస్తున్నారు. అత్యధికంగా గిరిజన క్రైస్తవ గ్రూపులు ఎక్కువగా కొండ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. వీరు నివసించే ప్రాంతం చాలా విశాలమైనది.

తాము చాలా తక్కువ ప్రాంతంలో నివసిస్తున్నామని మెయిటీలు బాధపడుతున్నారు. అయితే మెయిటీలు నివసించే ప్రాంతంలోనే ఆర్థిక అభివృద్ధి ఎక్కువగా ఉందని ఇటీవలప్రభుత్వం ఎక్కువ సౌకర్యాలు ఇంఫాల్, పరిసరప్రాంతాల్లోనే ఏర్పాటుచేశారని గిరిజనులు ఆరోపిస్తున్నారు. కొండప్రాంతాల్లో చాలా తక్కువ సౌకర్యాలే ఉన్నాయని, ఆర్థికంగా తాము దోపిడీకి గురవుతున్నామని గిరిజనులు ఫిర్యాదు చేస్తున్నారు. అత్యధిక జనాభా ఉన్న క్రైస్తవేతర మెయిటీలు,క్రైస్తవ గిరిజనుల మధ్య తీవ్ర విభజన ఉంది. ఈ రెండు గ్రూపుల మధ్య సయోధ్య కుదిర్చేందుకు ప్రభుత్వం పెద్దగా ప్రయత్నం చేయలేదు. మెయిటీల హోదాను పునర్‌నిర్వచిస్తామని కేంద్రప్రభుత్వం హామీ ఇచ్చేవరకు ఈ రెండుగ్రూపులమధ్య ఇటీవల కాలంలో పెద్దగా ఘర్షణలేమీలేవు. అయితే తాము దోపిడీకి గురవుతున్నప్పటికీ, ఆర్థికంగా దిగజారిపోతున్నామని చెబుతున్నప్పటికీ బీజేపీ నాయకులు పట్టించుకోవడంలేదని గిరిజన నాయకులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రకటనలు, గౌహతిహైకోర్టు తీసుకున్ననిర్ణయం తర్వాతనే హింసాకాండ జరిగింది. అంతకుముందు ఇలాంటి పరిస్థితి లేదు.

ప్రభుత్వ భూమిని అక్రమంగా ఆక్రమించుకుంటున్నారని మణిపూర్‌లో అడవులను నరికివేస్తూ విధ్వంసానికి పాల్పడుతున్నారని, బంగ్లాదేశ్‌కు, ఇంకా ఇతర నాయకులకు వీరి చర్యలు ప్రయోజనం కలిగిస్తున్నాయని రాష్ట్రప్రభుత్వం ఆరోపిస్తోంది. స్థానిక నాయకులు కూడా ఓటు బ్యాంకు తగ్గకుండా చూసుకునేందుకు ఇలాంటి పనులకు సహకరిస్తున్నారని చెబుతున్నారు. మెయిటీలు, గిరిజనుల పరిస్థితులను పరిశీలించేందుకు కొండప్రాంతాల్లో ఇల్లిల్లు తనిఖీ చేయాలని ఇంఫాల్‌లో అధికారులు కోరుతున్నారు. అనంతరం పోలీసులు, సాయుధ మెయిటీ గ్రూపులతో కలిసి ఇల్లిల్లు తిరిగి తనిఖీలు చేస్తున్నారు. ఇది కుకీలు, తదితర గిరిజనులకు ఆగ్రహం తెప్పించింది. స్థానికంగా ప్రతిఘటన మొదలైంది. చివరకు కుకీలు ఆయుధాలు చేపట్టడం జరిగింది. ఇటీవల తలెత్తిన హింసాకాండలో గిరిజనులు ఎక్కువగా ఉన్నప్రాంతంలో తీవ్రవనష్టాలు జరిగాయని ఇంఫాల్ నుండి పనిచేసే మీడియా తెలియజేసింది. ఈ హింసాకాండలో అనేక వందల ఇల్లు, కార్యాలయాలు, షాపులు, ప్రార్థనాలయాలు, ప్రైవేటు ఆస్తులు ధ్వంసమయ్యాయి. కనీసం 100కోట్లకుపైగా నష్టం జరిగి ఉంటుంది. దీర్ఘకాలంగా మతాల మధ్య అపనమ్మకం ఏర్పడటంతో సామాజికంగా జరిగిన నష్టం అత్యంత విలువైనది. గ్రూపులమధ్య అసహనం పెరిగిపోయింది. అయినప్పటికీ హోంమంత్రిని కలిసిన ఎంఎల్‌ఏలు కూడా బీజేపీలోనే ఉండి పనిచేస్తున్నారు. పొరుగున ఉన్న క్రైస్తవ మెజారిటీగల మిజోరం రాష్ట్రంలో గ్రూపులతో మాట్లాడిన తర్వాత వీరు బహిరంగంగానే డిన్నర్లు చేస్తున్నారు. గిరిజనులు, గిరిజనులేతర ప్రాంతాల మధ్య విభజన అనధికారికంగా ఇప్పటికే జరిగిపోయిందని నాగాలు, కుకీల నాయకులు చెబుతున్నట్లుగా మణిపూర్‌నుండి వార్తలు వస్తున్నాయి. రాష్ట్రంలో సాధారణపరిస్థితిని త్వరలో పునరుద్ధరిస్తామని బీజేపీ ముఖ్యమంత్రి బిరేన్‌సింగ్ ప్రకటించారు. రాష్ట్రంలో కల్లోల పరిస్థితులు ఏర్పడినప్పటికీ బీజేపీ కేంద్ర నాయకత్వం కనీసం ఆప్రాంతాన్ని సందర్శించి పరిస్థితిని అంచనావేయలేదు.

పీఎస్‌బీల రక్షణకు ఐక్యపోరాటం

సి.హెచ్. వెంకటాచలం
ఏఐబీఈఏ ప్రధాన కార్యదర్శి

ప్రభుత్వరంగ బ్యాంకుల పరిరక్షణకు ఐక్య పోరాటం చేయాలని ఇటీవల జరిగిన ఏఐబీఈఏ మహాసభ తీర్మానించింది. మే 13 నుంచి 15, 2023 వరకు ముంబైలో జరిగిన ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ) 29వ జాతీయ సదస్సు విజయవంతంగా ముగిసింది. దేశం నలుమూలల నుండి 3,000మందికి పైగా ప్రతినిధులు, పరిశీలకులు ఈ సదస్సులో పాల్గొన్నారు. ముఖ్యంగా నాగాలాండ్, మణిపూర్, త్రిపుర, అరుణాచల్ ప్రదేశ్, మిజోరాం, జమ్మూ, కాశ్మీర్ సహా అన్ని రాష్ట్రాల నుండి ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో యువ ఉద్యోగులు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి సంబంధించిన పబ్లిక్ సెషన్ మే 13 సాయంత్రం జరిగింది. రిసెప్షన్ కమిటీ చైర్మన్‌గా ప్రముఖ పాత్రికేయుడు పి సాయినాథ్ పాల్గొన్నారు. స్వాగత ప్రసంగంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ సంక్షోభానికి మద్దతుగా బ్యాంకు ఉద్యోగుల సంఘాలు ముందు వరుసలో ఉన్నారని అన్నారు. గత 10 ఏళ్లలో 4 లక్షల మంది రైతులు చనిపోయారని స్వాతంత్ర్యంవచ్చిన 75వ సంవత్సరంలో భారతదేశం అత్యంత అసమానత కలిగిన దేశంగా నమోదైందని పేర్కొన్నారు. కరోనా మహమ్మారికారణంగా దేశంలో దాదాపు 4.5మిలియన్లమంది మరణించారు. 750మందికి పైగా జర్నలిస్టులు మరణించారని పేర్కొన్నారు. హ్యూమన్ డెవలప్‌మెంట్ నివేదిక ఆధారంగా అంతర్జాతీయంగా పేదరికం సూచీలో, అంతర్జాతీయ పత్రికా స్వేచ్ఛ సూచీల్లో మనం అత్యంత అథమస్థితిలో ఉన్నాం. కానీ, ఫోర్బ్స్ బిలియనీర్ల జాబితాలో మాత్రం మూడవ స్థానంలో ఉన్నాం. అంటే అసమానత నిష్పత్తిలో మాత్రం ముందంజలోఉన్నాం.

ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్జీత్ కౌర్ తన ప్రారంభోపన్యాసంలో మాట్లాడుతూ, 1920లో ముంబైలో ఏఐటీయూసి స్థాపించినట్లు పేర్కొన్నారు.. ఏఐటీయూసీ కార్మికుల అభ్యున్నతి కోసమే కాకుండా స్వాతంత్ర్య పోరాటంలో రాజకీయపాత్ర పోషించిందని ఆమె వివరించారు. బీజేపీ ప్రభుత్వ విధానాల అమలుతో దేశంలో అన్ని రంగాలు క్షీణించాయని అన్నారు. మూడు దశాబ్దాలకు పైగా ప్రభుత్వాల నయా ఉదారవాద ఆర్థిక వ్యవస్థకు వ్యతిరేకంగా సెంట్రల్ ట్రేడ్ యూనియన్లు పోరాడుతున్నాయన్నారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న సంస్కరణల ఎజెండాలో నిరుద్యోగిత రేటు, ఉద్యోగ నష్టాలు, రైతుల కష్టాలను ఆమె ప్రస్తావించారు. గుజరాత్‌లో ముఖ్యమంత్రిగా, 2014 నుండి ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ హయాంలో గౌతమ్ అదానీల పెరుగుదలను ఆమె హైలైట్ చేశారు. సంఘటిత కార్మిక సంఘాలు తమ ఆందోళనలు, సమ్మెల ద్వారా అద్భుతాలు సృష్టించగలవని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. కార్మికుల హక్కులకోసం యూనియన్లు పోరాడాలని, దేశ ఆర్థిక వ్యవస్థ పతనం నుండి రక్షించడానికి అన్ని రంగాల స్థాయి ట్రేడ్ యూనియన్‌లతో ప్రభుత్వం ఏకీభవించాలని కౌర్ సూచించారు.

కార్మిక సంఘాల డిమాండ్‌లను నిర్వీర్యంచేసేందుకు ప్రభుత్వం లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని కౌర్ హెచ్చరించారు. లేబర్ కోడ్‌లు భారతదేశంలో అంతర్జాతీయ పెట్టుబడులకు "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్" లక్ష్యంగా తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. కార్మిక చట్టాలు సంఘటిత కార్మికులకు మాత్రమే రక్షణ కల్పిస్తాయి. అసంఘటిత కార్మికులకు కార్మిక చట్టాల ప్రకారం రక్షణ లేదు. ఇప్పటికీ శ్రామిక శక్తిలో 90 శాతానికి పైగా ఉన్న అసంఘటిత కార్మికులు పోరాటాలు, సమ్మెలు చేస్తూనేఉన్నారు. కార్మిక సంఘాలపై జరుగుతున్న దాడులను ఎదుర్కోవాలని, దేశంలో లౌకిక, ప్రజాస్వామ్య వ్యవస్థను నిర్మించేందుకు పోరాటాలు చేపట్టాలని ఆమె పిలుపునిచ్చారు. జనవరి 30, 2023న న్యూఢిల్లీలో జరిగిన అన్ని కార్మికుల సదస్సులో దేశ ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు ఏడాది పొడవునా సమ్మెలు, పోరాటాలు వంటి కార్యక్రమాలు చేయాలని నిర్ణయించారు. ఈ పోరాటంలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తిచేశారు. ఏఐబీఈఏ బ్యానర్ కింద బ్యాంకు ఉద్యోగులు ప్రభుత్వ ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని, కార్మికులకు అండగా ఉండి, మత శాంతి, సామరస్యాలు నెలకొల్పేందుకు, దేశంలో ప్రజాస్వామ్య వాతావరణం నెలకొనే పార్టీలకు ఓటు వేయాలని పేర్కొన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు, ప్రభుత్వ రంగాన్ని కాపాడేందుకు పోరాటాలు చేపట్టాలని సూచించారు.

భారత ఆర్థిక వ్యవస్థ నిలదొక్కుకోవాలంటే దానికి ప్రభుత్వ రంగ బ్యాంకులే ప్రధాన కారణం. 2008 ఆర్థిక సంక్షోభాన్ని భారతదేశం తట్టుకోగలిగి, బ్యాంకు ఉద్యోగులు 30 ఏళ్లపాటు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారు. 1990లో భారతదేశంలో డాలర్

బిలియనీర్ లేదు. 1994లో ముగ్గురు డాలర్ల బిలియనీర్లు ఉన్నారు. 2012 నాటికి, 53 మంది డాలర్ల బిలియనీర్లు ఉన్నారు. 23 సంవత్సరాలలో 56 మంది డాలర్ల బిలియనీర్లు నమోదయ్యారు. 2014 నుండి 9 సంవత్సరాల కాలంలో, మన దేశంలో 166 డాలర్ల బిలియనీర్లు నమోదుకానున్నారు. ఇది బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి అంటే పది సంవత్సరాలలో 110 మంది బిలియనీర్లు నమోదయ్యారు. 10 సంవత్సరాలలో, గౌతమ్ అదానీ సంపద 3400 శాతానికి పెరిగింది. ఎల్ఐసి, ఎస్‌బీఐ గౌతమ్ అదానీ గ్రూపులోకి నిధులను భారీ స్థాయిలో పంపినట్లు తాజాగా జరిగిన స్కామ్‌లో తెలుస్తోంది.

ఈ సందర్భంగా 105 మిలియన్ల కార్మికుల తరపున డబ్లుఎఫ్‌టీయూ జనరల్ సెక్రటరీ పాంబిస్ కిరిట్సిస్ సదస్సును అభినందించారు. బ్యాంకు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను, ట్రేడ్ యూనియన్ హక్కులను పరిరక్షించడంలో ఏఐబీఈఏ కృషి చేస్తుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వాల తప్పుడు విధానాలతో కార్మికలు స్వేచ్ఛ, ఉద్యోగ అభద్రతలో ఉన్నారని దీనికి భారతదేశం కూడా దీనికి మినహాయింపు కాదని అన్నారు. దేశాల ఆర్థిక వ్యవస్థలో బ్యాంకులు, బీమా రంగం కీలక పాత్ర పోషిస్తాయి. బ్యాంకింగ్ వ్యవస్థలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వేతనాల పెంపుదల, పెన్షన్ సంస్కరణలకోసం పోరాడాలన్నారు. మన దేశంలో ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేయడం ద్వారా కార్పొరేట్లు, గుత్తాధిపత్యం,బహుళజాతి సంస్థలకు మద్దతు ఇచ్చే మితవాద విధానాలను అనుసరిస్తోందని ప్రస్తుత ప్రభుత్వం బ్యాంకుల ప్రైవేటీకరణకు యత్నిస్తోందని హెచ్చరించారు. ఈ సదస్సులో యుఎఫ్‌బియు కన్వీనర్ సంజీవ్ బండ్లిష్ పాల్గొన్నారు. కిసాన్ నాయకుడు సుఖ్‌దేవ్ సింగ్ మాట్లాడుతూ, పంజాబ్‌లో, జీఎస్‌టి పెరగడం వల్ల ట్రాక్టర్లు ధరలు పెరిగాయిని, ట్రాక్టర్ల కొనుగోలుకు రుణాలుపొందడం, వడ్డీ చెల్లింపులు రైతులకు సమస్యగా మారిందని అన్నారు. ఇంతకు ముందు ప్రభుత్వ రంగ బ్యాంకులకు రుణాలు తీసుకోవడానికి వెళ్లేవారు అయితే ఇప్పుడు ప్రైవేటు బ్యాంకులు ఎంత రుణం కావాలని రైతుల వద్దకు వస్తున్నాయి. మోదీ ప్రభుత్వం వ్యవసాయ భూములను బహుళజాతి కార్పొరేట్లకు అప్పగించేందుకు ప్రయత్నిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

బ్రెజిల్, మలేషియా, డెన్మార్క్, ఈజిప్ట్, పాలస్తీనా, బెలారస్, సిరియా, మారిషస్, శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్, సైప్రస్‌లకు చెందిన బ్యాంక్ యూనియన్‌లకు చెందిన విదేశీ ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. బ్యాంకులను ప్రైవేటీకరించే ప్రభుత్వ ప్రయత్నాలను మరింత ప్రతిఘటించాలని సమావేశం తీర్మానించింది. ప్రభుత్వం బ్యాంకు ప్రైవేటీకరణ బిల్లుతో ముందుకు వెళితే నోటీసులతో పోరాటాలకు సిద్ధంగా ఉండాలని సభ్యులకు ఈ సమావేశం పిలుపునిచ్చింది. బ్యాంకుల్లో తగిన రిక్రూట్‌మెంట్‌ల కోసం దేశవ్యాప్త పోరాటాలు చేపట్టాలని కూడా సదస్సు నిర్ణయించింది. బీజేపీ నాయకత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం ప్రజల, రైతులు, కార్మికుల,పేదల వ్యతిరేక విధానాలు అవలంబిస్తోంది. అందువల్ల దేశవ్యాప్తంగా ఆర్థికరంగాన్ని, ప్రజలను, దేశాన్ని కాపాడేందుకు గాను ప్రభుత్వ రంగ బ్యాంకుల పరిరక్షణకు ప్రచారం, పోరాటం చేయాలని సభ తీర్మానించింది.

అక్రమాలు కనిపించలేదట!

అదానీ గ్రూప్‌నకు సుప్రీం నిపుణుల కమిటీ క్లీన్‌చిట్

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ అదానీ గ్రూపునకు క్లీన్‌చిట్ ఇచ్చింది. అదానీ గ్రూప్ కంపెనీలపై హిండెన్‌బర్గ్ రీసెర్చ్ చేసిన ఆరోపణలపై వాస్తవాలు వెలికితీసేందుకు ఏర్పాటైన నిపుణుల కమిటీ తన నివేదికను సుప్రీంకోర్టుకు సమర్పించింది. అదానీ గ్రూప్ కంపెనీల స్టాక్స్‌లో కృత్రిమ వ్యాపార ధోరణి కనిపించలేదని కమిటీ వెల్లడించింది. 2020 నుంచి దర్యాప్తులో ఉన్న 13 విదేశీ సంస్థల యాజమాన్యాన్ని సెబీ నిర్ణయించలేకపోయినట్లు పేర్కొంది. ఏది ముందు, ఏది తర్వాత అనే అంశాన్ని నిర్ధారించలేని సందిగ్ధతలో పడినట్లు కనిపించిందని తెలిపింది. ఈ నివేదికతో అదానీ గ్రూప్ కంపెనీలకు క్లీన్ చిట్ లభించినట్లయింది. సుప్రీంకోర్టు అదానీ గ్రూప్‌పై దర్యాప్తు కోసం ఓ కమిటీని మార్చిలో నియమించింది. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఏఎం సప్రే నేతృత్వంలో ఈ కమిటీ ఏర్పాటు అయింది. దీనిలో సభ్యులుగా ఓపీ భట్, జస్టిస్ జేపీ దేవధర్, కేవీ కామత్, నందన్ నీలేకని, సోమశేఖర్ సుందరేశన్‌లను నియమించింది. కమిటీ తన నివేదికను ఇటీవల సుప్రీంకోర్టుకు సమర్పించింది. దీనిని సుప్రీంకోర్టు శుక్రవారం ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. నియంత్రణ వైఫల్యాలు ఉన్నట్లు తమ ప్రాథమిక దర్యాప్తులో కనిపించలేదని కమిటీ నివేదిక తెలిపింది. అదానీ స్టాక్స్ విషయంలో 849 ఆటోమేటెడ్ 'సస్పిషియస్' అలర్ట్‌లను సిస్టమ్ సృష్టించినట్లు తెలిపింది. ఈ అలర్ట్‌లను స్టాక్ ఎక్స్ఛేంజ్‌లు పరిశీలించినట్లు వెల్లడించింది. నాలుగు నివేదికలను సెబీకి సమర్పించినట్లు పేర్కొంది. వీటిలో రెండింటిని హిండెన్‌బర్గ్ నివేదికకు ముందు, రెండింటిని ఆ తర్వాత అందజేసినట్లు వివరించింది. అదానీ-హిండెన్‌బర్గ్ సమస్యపై చర్చించడానికి చాలా అంతర్జాతీయ సెక్యూరిటీస్ సంస్థలతో సంప్రదించేందుకు ప్రయత్నించామని కమిటీ సుప్రీంకోర్టుకు వివరించింది. అయితే అంతర్జాతీయ సెక్యూరిటీ సంస్థలు కానీ, బ్యాంకులు కానీ తమతో మాట్లాడటానికి ఇష్టపడలేదని చెప్పింది. అదానీ గ్రూప్‌తో తమకు వ్యాపార సంబంధాలు ఉన్నందువల్ల ఆసక్తుల సంఘర్షణ ఏర్పడుతుందని కొన్ని అంతర్జాతీయ సంస్థలు చెప్పాయని, హిండెన్‌బర్గ్ నివేదిక విడుదలైన తర్వాత అదానీ లిస్టెడ్ స్టాక్స్‌లో రిటెయిల్ మదుపరుల కార్యకలాపాలు పెరిగాయని కమిటీ నివేదిక వివరించింది. చట్టాల ద్వారా నియంత్రణ వైఫల్యం ఉందా? లేదా? అనేదానిని నిర్ధారించడం కష్టమని, ఇందుకుగాను పటిష్ఠ విధానాన్ని అమలు చేయవలసిన అవసరం ఉందని సూచించింది. సెబీ అనుసరిస్తున్న చట్టబద్ధ విధానానికి అనుగుణంగా ఈ ఎన్‌ఫోర్స్‌మెంట్ పాలసీ ఉండాలని చెప్పింది. హిండెన్‌బర్గ్ నివేదిక విడుదలవడానికి ముందు కొన్ని సంస్థలు షార్ట్ పొజిషన్స్ తీసుకున్నాయని, హిండెన్‌బర్గ్ నివేదిక విడుదలైన తర్వాత ఆ సంస్థలు లాభపడ్డాయని వివరించింది. ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్ట్‌మెంట్ కేటగిరీలో దాదాపు 42 మంది మదుపరుల వివరాలు మనీలాండరింగ్ నిరోధక చట్టం నిబంధనల ప్రకారం అందుబాటులో ఉన్నట్లు చెప్పింది. అమెరికాకు చెందిన షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ జనవరిలో అదానీ గ్రూప్ కంపెనీలకు వ్యతిరేకంగా ఓ నివేదికను విడుదల చేసింది. అదానీ గ్రూపు స్టాక్ అక్రమాలు, ఇతర అవకతవకలకు పాల్పడుతున్నదని ఆరోపించింది. ఈ ఆరోపణల ప్రభావంతో అప్పట్లో అదానీ కంపెనీల ఆస్తుల విలువ దారుణంగా క్షీణించింది. అదానీ గ్రూప్ కంపెనీలపై సెబీ దర్యాప్తు గడువును ఆగస్టు 14 వరకు సుప్రీంకోర్టు పెంచిన సంగతి తెలిసిందే.

శివలింగం కార్బన్ డేటింగ్‌పై సుప్రీం స్టే

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో ఉన్న జ్ఞానవాపి మసీదు ప్రాంగణంలో 'శివలింగం' వయసును శాస్త్రీయంగా నిర్ణయించాలని, కార్బన్ డేటింగ్ వంటి ఆధునిక టెక్నాలజీని ఉపయోగించాలని అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సుప్రీంకోర్టు శుక్రవారం నిలిపేసింది. గతేడాది నిర్వహించిన వీడియోగ్రాఫిక్ సర్వేలో ఈ 'శివలింగం' కనిపించింది. అయితే ఇది ఫౌంటెన్ అని ముస్లిం పక్షం వాదిస్తోంది. జ్ఞానవాపి మసీదు కమిటీ దాఖలు చేసిన పిటిషన్‌పై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. 'శివలింగం' వయసును నిర్ధారించేందుకు కార్బన్ డేటింగ్ నిర్వహించాలని అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల పర్యవసానాలను పరిశీలిస్తే... దీనిపై మరింత లోతుగా విచారించవచ్చని తెలిపింది. హైకోర్టు ఆదేశాలు తదుపరి విచారణ తేదీ వరకు నిలిపివేస్తున్నట్లు తెలిపింది. వారణాసిలోని కాశీ విశ్వనాథుని దేవాలయం పక్కనే జ్ఞానవాపి మసీదు ఉన్న విషయం విదితమే.

100 యూనిట్ల విద్యుత్ ఉచితం: కమల్‌నాథ్ హామీ

భోపాల్: కర్నాటక తరహా ఎన్నికల ప్రచారాన్నే మధ్యప్రదేశ్‌లోనూ అనుసరించాలని కాంగ్రెస్ భావిస్తోంది. మధ్యప్రదేశ్ అసెంబ్లీకి ఈ ఏడాది చివరిలో ఎన్నికలు జరగనున్నాయి. కర్నాటకలో విజయం సాధించి మంచి ఊపుమీదున్న కాంగ్రెస్...ఆ తరహా ఎన్నికల ప్రచారంపై దృష్టి సారించింది. మధ్యప్రదేశ్ సహా త్వరలో ఎన్నికలు జరగనున్న ఇతర రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్ ఇదే అమలు చేయాలనుకుంటున్నట్టు కనిపిస్తోంది. అందులో భాగంగా మధ్యప్రదేశ్ ప్రజలకు ఉచిత విద్యుత్ హామీని ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత కమల్‌నాథ్ ప్రకటించారు. 100 యూనిట్ల వరకూ విద్యుత్ బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేదని ఆయన ట్వీట్ చేశారు. తాను మొదటిసారిగా చెబుతున్నానని, 100 యూనిట్ల వరకూ విద్యుత్ బిల్లులు ఉండవని, 200 యూనిట్ల వరకూ సగం బిల్లు చెల్లిస్తే సరిపోతుందని కమల్‌నాథ్ ఆ ట్వీట్‌లో తెలిపారు. కర్నాటక తరహాలోనే రాష్ట్రంలో మహిళలకు ఎలాంటి ముందస్తు షరతులు లేకుండా రూ.1,500 వరకూ నెలసరి సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. గ్యాస్ బండపై రాష్ట్ర ప్రభుత్వ సబ్సిడీని పెంచనున్నట్టు కమల్‌నాథ్ హామీ ఇచ్చారు. రైతు రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చారు.

మాజీ ఎంపీ రెమిషన్‌పై రికార్డులివ్వండి

నితీశ్ సర్కార్‌కు సుప్రీం ఆదేశాలు

న్యూఢిల్లీ: ఐఏఎస్ అధికారి కృష్ణయ్య హత్య కేసు నిందితుడు, గ్యాంగ్‌స్టర్, మాజీ ఎంపీ ఆనంద్ మోహన్ ముందస్తు విడుదలపై బీహార్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు షాక్ ఇచ్చింది. ఆనంద్‌మోహన్ విడుదలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు శుక్రవారం విచారణ చేపట్టింది. ఆయన శిక్షా కాలాన్ని తగ్గించి రెమిషన్ మంజూరు చేయడానికి సంబంధించిన వాస్తవిక రికార్డులన్నింటినీ సమర్పించాలని బీహార్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణలోగా వాటిని న్యాయస్థానం ముందుంచాలని స్పష్టం చేసింది. ఆనంద్ మోహన్‌కు రెమిషన్ మంజూరు చేయడాన్ని సవాల్ చేస్తూ కృష్ణయ్య భార్య ఉమాదేవి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై గతంలో విచారణ జరిపిన న్యాయస్థానం...హత్య కేసులో నిందితుడిగా శిక్ష అనుభవిస్తున్న వ్యక్తిని ముందుగా విడుదల చేయడంపై వివరణ ఇవ్వాలని బీహార్ ప్రభుత్వంతోపాటు కేంద్ర హోంశాఖ, ఆనంద్ మోహన్‌కు నోటీసులు జారీ చేసింది. అయితే, ఆనంద్ మోహన్ విడుదల కోసం బీహార్ ప్రభుత్వం జైలు నిబంధనలు మార్చేసిందని ఉమాదేవి కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం... మాజీ ఎంపీ రెమిషన్‌కు సంబంధించిన అన్ని పత్రాలు కోర్టుకు సమర్పించాలని ఆదేశించింది. వీటితో పాటు ఆనంద్ మోహన్ నేరచరిత్రకు సంబంధించిన పత్రాలను కూడా ఇవ్వాలని సూచించింది. ఉమాదేవి పిటిషన్‌కు తమ స్పందన తెలియజేసేందుకుగాను బీహార్ ప్రభుత్వానికి మరింత గడువు కల్పించింది. దీనిపై ఆగస్టు 8న తదుపరి విచారణ చేపడతామని ధర్మాసనం తెలిపింది. ఆ తర్వాత వాయిదాలు ఉండబోవని స్పష్టం చేసింది.

'రక్షణ' తయారీలో భారత్ రికార్డు

రూ.లక్ష కోట్లు దాటిన ఉత్పత్తి

న్యూఢిల్లీ: రక్షణ ఉత్పత్తుల తయారీలో భారతదేశం రికార్డు సృష్టించింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో తొలిసారిగా రూ.లక్ష కోట్లకుపైగా విలువైన రక్షణ ఉత్పత్తులు తయారు చేసింది. ప్రస్తుతం ఉత్పత్తుల విలువ రూ.1.06 లక్షల కోట్లుగా ఉంది. ఇంకా మరికొన్ని ప్రైవేటు రక్షణ సంస్థల నుంచి డేటా వస్తే మరింత పెరుగుతుందని కేంద్రం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. స్వావలంబనే లక్ష్యంగా... రక్షణ శాఖ స్థిరమైన ప్రయత్నాలతో ఈ రికార్డు సాధ్యమైందని పేర్కొంది. ఇదిలా ఉండగా...2022-23 ఆర్థిక సంవత్సరంలో నమోదైన రక్షణ ఉత్పత్తుల విలువ... 2021-22లోని రూ.95 వేల కోట్లతో పోలిస్తే 12 శాతానికిపైగా అధికం. రక్షణ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు, వాటికి పరిష్కార మార్గాలు కనుగొనేందుకు తమ శాఖ నిరంతరం పని చేస్తోందని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ట్వీట్ చేశారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, స్టార్టప్‌ల ఏకీకరణతో సహా రక్షణ రంగంలో వ్యాపారాన్ని సులభతరం చేసేందుకు కేంద్రం అనేక సంస్కరణలు ప్రవేశపెట్టిందని, దీంతోపాటు 7-8 ఏళ్లలో ప్రభుత్వం ద్వారా పరిశ్రమలకు జారీ అయిన రక్షణ లైసెన్సుల సంఖ్యలో దాదాపు 200 శాతం పెరిగిందని కేంద్రం తెలిపింది. ఈ చర్యలు దేశంలోని రక్షణ పారిశ్రామిక ఉత్పాదక వ్యవస్థకు ప్రోత్సాహాన్ని అందించాయని, ఉపాధి అవకాశాలు సృష్టించాయని కేంద్రం తెలిపింది.

ఇది శిక్ష కాదు

భూ విజ్ఞానశాఖ బాధ్యతలు చేపట్టిన రిజిజు

న్యూఢిల్లీ: తనను న్యాయశాఖ మంత్రి పదవి నుంచి తొలగించి, మరో శాఖను అప్పగించడం పట్ల భూ విజ్ఞానశాస్త్ర శాఖ మంత్రి కిరణ్ రిజిజు సానుకూలంగా స్పందించారు. మంత్రివర్గంలో మార్పులు సాధారణ విషయమేనని చెప్పారు. తన శాఖను మార్చడంలో మోదీ దార్శనికత కనిపిస్తోందని, ఈ మార్పు ద్వారా తనను శిక్షించినట్లు కాదని సమర్థించుకున్నారు. కిరణ్ రిజిజు భూ విజ్ఞానశాస్త్ర శాఖ మంత్రిగా బాధ్యతలను శుక్రవారం స్వీకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ మార్పు సర్వసాధారణ ప్రక్రియేనని, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దార్శనికతకు ఇది నిదర్శనమని చెప్పుకొచ్చారు. ఎవరో ఒకరు బాధ్యతను స్వీకరించాలని చెప్పారు. తనకు వ్యతిరేకంగా మాట్లాడటం ప్రతిపక్షాల కర్తవ్యమని, వారిని మాట్లాడనివ్వండన్నారు. ఇది రాజకీయాలు మాట్లాడవలసిన రోజు కాదని పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని లోధీ రోడ్‌లో పృథ్వీ భవన్‌లో కిరణ్ రిజిజు బాధ్యతలు చేపట్టారు. మోదీ సిఫారసు మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం మంత్రివర్గంలో మార్పులు చేసిన సంగతి తెలిసిందే. న్యాయ మంత్రిత్వశాఖ నుంచి కిరణ్ రిజిజును తొలగించి, ఆ పదవిని అర్జున్ రామ్ మేఘ్వాల్‌కు అప్పగించారు. న్యాయశాఖ మంత్రిగా బీజేపీకి నమ్మకస్థుడిగా మెలిగిన రిజిజుకు తక్కువ స్థాయి గల భూ విజ్ఞానశాస్త్ర శాఖను అప్పగించారు. న్యాయమూర్తుల నియామకానికి అనుసరిస్తున్న సుప్రీంకోర్టు కొలీజియం వ్యవస్థను రిజిజు పదేపదే తప్పుబట్టారు. దీంతో కేంద్రానికి, న్యాయ వ్యవస్థకు మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది.

బీహార్ అంటే బీజేపీకి భయం

తేజస్వి యాదవ్ విమర్శ

పాట్నా: కర్నాటక తర్వాత బీహార్ అంటే భయపడటం వల్లే బీజేపీ తమను లక్ష్యంగా చేసుకున్నదని బీహార్ ఉపముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ ఆరోపించారు. ఉద్యోగాల కోసం భూమి కేసులో తన తల్లి రాబ్రీదేవిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ప్రశ్నించడం దేశంలోని రాజకీయ పరిణామాలతో, ముఖ్యంగా రాష్ట్రంలో వచ్చే ఏడాది ఎన్నికలు, గతవారం కర్నాటకలో ఓటమికి ముడిపడి ఉందని అన్నారు. 'ఇలా జరుగుతుందని మాకు తెలుసు. కర్నాటక తర్వాత బీహార్ అంటే భయపడి మమ్మల్ని టార్గెట్ చేస్తున్నారు. భవిష్యత్తులో నన్ను కేసులో ఇరికించే అవకాశం ఉంది. అమాయకులు, నేను భయపడాల్సిన పని లేదు' అని తెలిపారు. ఉద్యోగాల కోసం భూ కుంభకోణంతో ముడిపడి ఉన్న మనీలాండరింగ్ కేసులో ఆర్థిక నేరాలను దర్యాప్తు చేస్తున్న కేంద్ర దర్యాప్తు సంస్థ గురువారం ఢిల్లీలో బీహార్ మాజీ ముఖ్యమంత్రి రాబ్రీదేవిని సుమారు ఐదు గంటల పాటు ప్రశ్నించింది. రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జేడీ) అధినేత లాలూ యాదవ్ భార్య 68 ఏళ్ల రాబ్రీదేవి వాంగ్మూలాన్ని నమోదు చేసినట్లు దర్యాప్తు సంస్థ వర్గాలు తెలిపాయి. రాబ్రీదేవి పిల్లలు...తేజస్వీ యాదవ్ సహా కుమార్తెలు మిసా భారతి (రాజ్యసభలో ఆర్‌జేడీ ఎంపీ), చందా యాదవ్, రాగిణి యాదవ్‌ను ఈ కేసులో ఈడీ కొన్ని నెలలుగా ప్రశ్నించింది. ఈ ఏడాది మార్చిలో జరిగిన సోదాల్లో లెక్కల్లో లేని రూ.కోటి నగదును స్వాధీనం చేసుకున్నామని, రూ.600 కోట్ల విలువైన అక్రమ ఆదాయాన్ని గుర్తించామని ఈడీ పేర్కొంది.

అభిషేక్ బెనర్జీ విచారణకు అనుమతి

పాఠశాల నియామకాల కేసులో కలకత్తా హైకోర్టు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ పాఠశాల ఉద్యోగాల కుంభకోణం కేసులో తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీని ప్రశ్నించేందుకు కలకత్తా హైకోర్టు గురువారం (మే 18) ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) కి అనుమతి ఇచ్చింది. తనను ప్రశ్నించేందుకు దర్యాప్తు సంస్థలను అనుమతిస్తూ గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించాలని అభిషేక్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ అమృత సిన్హా గురువారం కొట్టివేశారని ఆంగ్ల వార్తా సంస్థ ఒకటి పేర్కొంది. అరెస్టయిన టీఎంసీ యువనేత కుంతల్ ఘోష్... కేంద్ర దర్యాప్తు సంస్థలు తనపై ఒత్తిడి తీసుకువచ్చాయంటూ చేసిన ఆరోపణలపై ప్రశ్నించేందుకు కూడా కోర్టు అనుమతినిచ్చింది. 'న్యాయమూర్తి సిన్హా కోర్టు హాలులో ఆదేశాలను చదివారు. అభిషేక్ బెనర్జీ, కుంతల్ ఘోష్ దరఖాస్తులను ధర్మాసనం తోసిపుచ్చింది. వీరికి ఒక్కొక్కరికి రూ. 25 లక్షల చొప్పున జరిమానా కూడా విధించింది' అని హైకోర్టు న్యాయవాది ఫిర్దౌస్ షమీమ్ తెలిపారు. ఈ కేసులో ఇప్పటి వరకు ఇద్దరు సీనియర్ టీఎంసీ నేతలను అరెస్టు చేశారు. కలకత్తా హైకోర్టు సింగిల్ జడ్జి బెంచ్, డివిజన్ బెంచ్ నియమించిన రిటైర్డ్ జడ్జి నేతృత్వంలోని కమిటీ దర్యాప్తులో రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉద్యోగ నియామకాల్లో తీవ్ర అవినీతి చోటుచేసుకుందని వెల్లడయింది. కాగా బొగ్గు అక్రమ రవాణా కుంభకోణం కేసుకు సంబంధించి అభిషేక్, అతని భార్య, అతని కోడలును కూడా కేంద్ర దర్యాప్తు సంస్థలు ప్రశ్నించాయి.

కేరళలో ఆర్థిక పురోగతి

మంత్రి బాలగోపాల్

తిరువనంతపురం: కేరళ ఆర్థిక పురోగతి అద్భుతమని, గత ఆర్థిక సంవత్సరంలో పన్ను ఆదాయం పెరిగిందని ఆ రాష్ట్ర ఆర్థికమంత్రి కేఎన్ బాలగోపాల్ అన్నారు. కేంద్రప్రభుత్వం అననుకూల ధోరణి ప్రదర్శించినప్పటికీ, 2022-23లో అనేక అడ్డంకులు ఎదురైనప్పటికీ రాష్ట్రం ఆర్థికంగా రాణించగలిగిందన్నారు. కేరళ ప్రభుత్వం పని ప్రశంసనీయమని అన్నారు. అభివృద్ధి, సంక్షేమ ప్రాజెక్టులకు నిధులను సమకూర్చడం, రెవెన్యూ వసూళ్ల వ్యవస్థ సమర్థవంతంగా కొనసాగడం వంటివాటిని మంత్రి ప్రస్తావించారు. కేరళ స్వీయసమృద్ధిగా ఉండటంతో అంతర్జాతీయ ఆర్థిక సవాళ్ల నడుమ భవిష్యత్ ఆటంకాలను అధిగమించగలమన్న ఆశలు చిగురించాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారిక మ్యాగజైన్ 'కేరళ కాలింగ్'లో 'రైజింగ్ టు ది ఛాలెంజెస్' శీర్షికన ప్రచురితమైన వ్యాసంలో ఆర్థికమంత్రి ఈ మేరకు పేర్కొన్నారు. మార్చిలో కేరళ ప్రభుత్వం రూ.22వేల కోట్లను ఖజానా నుంచి వేర్వేరు ప్రభుత్వ కార్యకలాపాల కోసం ఖర్చు పెట్టిందని, సంక్షేమ, అభివృద్ధి ప్రాజెక్టులు నిరాటకంకంగా సాగించిందని మంత్రి వెల్లడించారు. పన్ను, పన్నుయేతర ఆదాయాన్ని పెంచుకునేందుకు కేరళ నిబద్ధతతో కసరత్తు చేసిందని, గణనీయమైన ఫలితాలు సాధించిందని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం పన్ను ఆదాయం రూ.12,848 కోట్లని చెప్పారు. రాష్ట్ర జీఎస్టీ మునుపటి కంటే 25శాతం వృద్ధిని నమోదు చేసినట్లు తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.40వేల కోట్ల మేర ఆదాయం పడిపోవడానికి కేంద్రప్రభుత్వ చర్యలు కారణమైనట్లు చెప్పారు. 15వ ఆర్థిక కమిషన్ నివేదిక ప్రకారం మొత్తం ఆదాయంలో 62.7శాతం కేంద్రం తీసుకొని రాష్ట్రాలకు 37.3శాతమే మిగుల్చుతోందని బాలగోపాల్ తెలిపారు. మరోవైపు 62.4శాతం వ్యయ భారాన్ని రాష్ట్రాలు మోస్తున్నట్లు తెలిపారు. 2022-23లో కేరళ రాష్ట్ర ఆదాయం 62.20 శాతమని, ఇది సొంత ఆదాయమన్నారు. దేశం మొత్తం మీద సగటుగా రాష్ట్రాల ఆదాయాలను గమనించినట్లయితే బీహార్ 24.16శాతం, అసోం, రాజస్థాన్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ 29.16శాతం, 56.03శాతం, 75.45శాతం, 43.43శాతం చొప్పున ఆర్జించినట్లు నివేదికలు చెబుతున్నాయి.

పారిశ్రామికాభివృద్ధి ఉన్న హరియాణా, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలు కేరళ కంటే ముందున్నాయి. కేరళ రాష్ట్రంలో పన్ను, పన్నుయేతర ఆదాయ నిర్వహణ వ్యవస్థల సామర్థ్యానికి తాజా గణాంకాలు అద్దం పట్టినట్లు బాలగోపాల్ వెల్లడించారు.

'సేవల'పై సుప్రీం తీర్పు అనుసరించండి

- దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌కు మంత్రుల వినతి
- సుప్రీం తీర్పు రద్దుకు కుట్రా? కేంద్రాన్ని ప్రశ్నించిన కేజ్రీవాల్

న్యూఢిల్లీ : సర్వీసు వ్యవహారాల్లో సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో దిల్లీ ప్రభుత్వానికి, లెఫ్టినెంట్ గవర్నర్‌కు మధ్య శుక్రవారం ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకున్నాయి. సేవల విషయంలో సుప్రీం తీర్పును అనుసరించవలసిందిగా అభ్యర్థించడానికి దిల్లీ మంత్రులు ఎల్జీ నివాసం వద్దకు వెళ్లారు. అయితే ఎల్జీ మరొక సమావేశంలో ఉన్నట్లు రాజ్ నివాస్ అధికారుల నుంచి సమాధానం వచ్చింది. కాగా, ఎన్నికయిన ప్రభుత్వానికి కార్య అధికారాలను కల్పిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును ఆర్డినెన్స్ ద్వారా తిప్పికొట్టేందుకు కేంద్రం కుట్ర చేస్తోందా అని దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ శుక్రవారం ప్రశ్నించారు. గత వారం సుప్రీం కోర్టు ఇచ్చిన ఒక ముఖ్యమైన తీర్పులో అధికారుల బదిలీ, పోస్టింగ్‌తో సహా సర్వీసు వ్యవహారాల్లో దిల్లీ ప్రభుత్వానికి కార్యనిర్వాహక అధికారం కల్పించింది. దిల్లీ కేబినెట్ మంత్రులు సేవలకు సంబంధించిన విషయాలపై సుప్రీం కోర్టు తీర్పును అనుసరించాలని అభ్యర్థించేందుకు శుక్రవారం లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె.సక్సేనా నివాసానికి వెళ్లారు. అయితే ఎలాంటి ముందస్తు అపాయింట్‌మెంట్, సమాచారం లేకుండానే మంత్రులు వచ్చారని రాజ్ నివాస్ అధికారులు తెలిపారు. యమునా కాలుష్యంపై దిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ), దిల్లీ జల్ బోర్డ్ అధికారులు, 13 కామన్ ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల (సీఈటీపీ) అధ్యక్షులతో లెఫ్టినెంట్ గవర్నర్ సమావేశంలో ఉన్నట్లు వారు తెలిపారు. ఇదిలాఉండగా, ఆప్ ఒక ట్వీట్‌లో, 'దిల్లీ కేబినెట్ మంత్రులు ఎల్‌జీ కార్యాలయం వెలుపల వేచి ఉన్నారు. మంత్రులందరూ ఎల్‌జీని ప్రశ్నించడానికి వచ్చారు. ఆయన సుప్రీం కోర్టు ఆదేశాలను ఎందుకు పాటించడం లేదు? రెండు రోజులుగా సర్వీసెస్ సెక్రటరీ ఫైల్‌పై ఎందుకు సంతకం చేయలేదు?' అని ప్రశ్నిస్తూ, రాజ్ నివాస్ వెలుపల వేచి ఉన్న సౌరభ్ భరద్వాజ్, అతిషి, గోపాల్ రాయ్, కైలాష్ గహ్లోట్‌తో సహా మంత్రుల చిత్రాలు, వీడియోలను కూడా పంచుకుంది. అంతకుముందు రోజు, సేవల మంత్రి భరద్వాజ్... ఎల్జీకి లేఖ రాశారు. సేవల కార్యదర్శి ఆశిష్ మోరే బదిలీకి సంబంధించిన ఫైల్‌ను ఆమోదించవలసిందిగా కోరారు. ఆలస్యం కారణంగా అనేక పరిపాలనా మార్పులు ఆగిపోయాయని చెప్పారు. అంతకుముందు, మంత్రి సౌరభ్ భరద్వాజ్ కూడా ఆర్డినెన్స్ తీసుకురావడం ద్వారా తీర్పును తిప్పికొట్టడానికి లెఫ్టినెంట్ గవర్నర్, కేంద్రం కుట్ర చేస్తున్నారా అని ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో మంత్రి, ఆప్ నాయకుడు మాట్లాడుతూ సేవల కార్యదర్శి ఆశిష్ మోర్ బదిలీకి సంబంధించిన ఫైల్‌ను ఆమోదించాలని తనను అభ్యర్థించడానికి లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె.సక్సేనాతో సమావేశానికి తనతో కలిసి రావాలని తన మంత్రివర్గ సహచరులను అభ్యర్థించినట్లు చెప్పారు. తర్వాత ట్వీట్‌లో కేజ్రీవాల్ భరద్వాజ్ అభియోగాన్ని పునరుద్ఘాటించారు. 'సుప్రీం కోర్టు ఆదేశాలను లెఫ్టినెంట్ గవర్నర్ ఎందుకు పాటించడం లేదు? సేవల కార్యదర్శికి సంబంధించిన ఫైల్‌పై రెండు రోజులుగా ఎందుకు సంతకం చేయలేదు? వచ్చేవారం ఆర్డినెన్స్ తీసుకురావడం ద్వారా కేంద్రం సుప్రీం ఆదేశాలను తిరగదోడబోతోందని చెబుతున్నారు. సుప్రీం ఆదేశాలను రద్దు చేసేందుకు కేంద్రం కుట్ర చేస్తోందా? ఎల్జీ సార్ ఆర్డినెన్స్ కోసం ఎదురుచూస్తున్నారా, అందుకే ఫైల్‌పై సంతకం చేయడం లేదు?' అని కేజ్రీవాల్ హిందీలో ట్వీట్ చేశారు. అంతకుముందు రోజు, భరద్వాజ్ సేవల కార్యదర్శి మోర్ బదిలీకి సంబంధించిన ఫైల్‌ను ఆమోదించాలని లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్‌జి) ని అభ్యర్థించారు. ఆలస్యం కారణంగా అనేక పరిపాలనా మార్పులు ఆగిపోయాయని చెప్పారు. దిల్లీ ప్రభుత్వం రెండు రోజుల క్రితమే ఫైల్‌ను పంపిందని ఎల్‌జీకి రాసిన లేఖలో భరద్వాజ్ పేర్కొన్నారు. పోలీసు, పబ్లిక్ ఆర్డర్, భూమికి సంబంధించిన వాటిని మినహాయించి దిల్లీ ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్న బ్యూరోక్రాట్‌లపై నియంత్రణ విధించాలని మే 11న సుప్రీం కోర్టు ఉత్తర్వులు జారీ చేసిన కొన్ని గంటల తర్వాత మరిన్ని బదిలీలు జరిగాయి. ఫైల్‌ను త్వరగా ఆమోదించాలని సక్సేనాను భరద్వాజ్ కోరారు.

రెజ్లర్లకు న్యాయం చేయడంలో జాప్యమెందుకు?

రాజస్థాన్ కాంగ్రెస్ నేత సచిన్ పైలట్

న్యూఢిల్లీ : రాజస్థాన్ కాంగ్రెస్ నాయకుడు సచిన్ పైలట్ శుక్రవారం జంతర్ మంతర్ వద్ద నిరసన తెలుపుతున్న రెజ్లర్లు (మల్లయోధులు) ను కలుసుకున్నారు. దేశం గర్వించే వారికి న్యాయం చేయడంలో జాప్యం ఏమిటని ప్రశ్నించారు. పైలట్ జంతర్ మంతర్ వద్దకు చేరుకుని రెజ్లర్లతో సుదీర్ఘంగా మాట్లాడారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత 26 రోజులుగా తమ బాధలను పంచుకునేందుకు మన రెజ్లర్లు నిరసనకు దిగుతున్నారని, అందరూ వారికి మద్దతు ఇస్తున్నారని, అయితే వారికి అందాల్సిన న్యాయం ఆలస్యమవుతోందని అన్నారు. ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని పైలట్... 'మనకు గర్వకారణమైన వారికి న్యాయం చేయడంలో ఎందుకు జాప్యం జరుగుతోంది? పరిపాలన యంత్రాంగం, పోలీసులు వేగంగా చర్యలు తీసుకోవాలి' అని అన్నారు. యువత, రైతులు, మల్లయోధులు సంతోషంగా లేకుంటే దేశం అభివృద్ధి చెందదని తెలిపారు. 'మల్లయోధుల బాధలు, సమస్యలను వినాలి. పరిష్కరించాలి. నిరసన తెలిపే మల్లయోధుల ఫిర్యాదులపై వేగంగా చర్యలు తీసుకోవాలి. న్యాయం అందించాలి' అని ఆయన డిమాండ్ చేశారు. ఇక్కడ మల్లయోధులకు మద్దతుగా అనేక మంది వస్తున్నారని తెలిపారు. 'వారి ఫిర్యాదుపై చర్య తీసుకోవాలి. తద్వారా మల్లయోధులు చర్యను నమ్ముతారు' అని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. 15 రూపాయలకే పతకాలు కొనుగోలు చేయవచ్చని డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ చేసిన వ్యాఖ్యలపై పైలట్ మరో ప్రశ్నకు, 'గత 26 రోజులుగా రెజ్లర్లు నిరసనలు చేస్తున్నారు. వారికి సకాలంలో న్యాయం జరిగి ఉంటే, అప్పుడు వారు ఇక్కడ కూర్చోవలసిన అవసరం లేదు. ఎటువంటి చర్య తీసుకోకపోవడంతో వారు ఈ వేడిలో ఇక్కడ కూర్చొన్నారు' అని అన్నారు. రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఎఫ్ఐ) చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేస్తూ గత 26 రోజులుగా రెజ్లర్లు జంతర్ మంతర్ వద్ద నిరసనలు చేస్తున్నారు.

అండమాన్‌లోకి నైరుతి రుతుపవనాలు

న్యూఢిల్లీ : నైరుతి రుతుపవనాలు శుక్రవారం ఆగ్నేయ బంగాళాఖాతం, నికోబార్ దీవులు, దక్షిణ అండమాన్ సముద్రం మీదుగా పురోగమించాయి. ఇది దేశ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన నాలుగు నెలల వర్షాకాలానికి వేదిక. కాగా కేరళలో రుతుపవనాలు ప్రారంభం, ప్రధాన భూభాగంలోకి ప్రవేశించడాన్ని సూచిస్తుంది. అయితే ఇది సాధారణంగా జూన్ 1 కంటే ఈ ఏడాది నాలుగు రోజులు ఆలస్యంగా ప్రవేశిస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఈ వారం ప్రారంభంలో తెలిపింది. 'నైరుతి రుతుపవనాలు శుక్రవారం ఆగ్నేయ బంగాళాఖాతం, నికోబార్ దీవులు, దక్షిణ అండమాన్ సముద్రంలోని కొన్ని ప్రాంతాలలోకి ప్రవేశించాయి' అని తెలిపింది. అలాగే వచ్చే 3 నుంచి 4 రోజుల్లో మరికొన్ని ప్రాంతాలకు మరింత ముందుకు సాగడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని పేర్కొంది. నాలుగు రోజుల ఆలస్యంగా జూన్ 4న కేరళపై రుతుపవనాలు ప్రారంభమయ్యే అవకాశం ఉందని మంగళవారం వాతావరణ కార్యాలయం తెలిపింది. గత ఏడాది మే 29న, 2021లో జూన్ 3న, 2020లో జూన్ 1న, 2019లో జూన్ 8న, 2018లో మే 29న రుతుపవనాలు కేరళకు చేరుకున్నాయి. ఇదిలాఉండగా, భారతదేశ 3.5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం 15 శాతం దోహదపడుతుంది.

అనంతపురంలో రూ.200 కోట్ల విలువైన

సీఎస్ఐ స్థలాన్ని కాపాడండి

సీఎం జగన్‌కు రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అనంతపురంలో దాదాపు రూ.200 కోట్ల విలువగల మిస్సమ్మ కాంపౌండ్ (సీఎస్ఐ) స్థలాన్ని కబ్జాదారుల నుండి కాపాడేందుకు తగు చర్యలు చేపట్టాలని కోరుతూ సీఎం జగన్‌కు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శుక్రవారం లేఖ రాశారు. అనంతపురం నగరపాలక సంస్థ పరిధిలోని ప్రభుత్వ సర్వ జన ఆసుపత్రి వెనుక భాగంలో చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా (సీఎస్ఐ)కి దాదాపు 200 కోట్ల విలువగల 7.67 ఎకరాల భూమి ఉన్నది. ఆ భూమిని సీఎస్ఐ నుండి కొనుగోలు చేశామంటూ మాజీ శాసనసభ్యులు బి. నారాయణరెడ్డి, గురునాథరెడ్డి, వారి సోదరులు ఎర్రిస్వామి రెడ్డి, రెడ్డప్పరెడ్డి ముందుకొచ్చారు. అక్కడ నివాసం ఉంటున్న పేదలను, విద్యాసంస్థలను ఖాళీ చేయించేందుకు 2007 నుండి విశ్వ ప్రయత్నం చేస్తూ దౌర్జన్యాలకు, దాడులకు తెగబడుతున్నారు.

లండన్‌కు చెందిన లూయిస్ క్రిస్ లిబ్ (మిస్సమ్మ) అనే మహిళ లండన్ మిషనరీ కార్పొరేషన్(ఎల్ఎంసీ) ప్రతినిధిగా ఉన్నారు. 1910లో అనంతపురం సర్వజన ప్రభుత్వ ఆసుపత్రి వెనుక భాగంలోని భూమిని పేద విద్యార్థుల విద్య, వసతి గృహాల నిర్మాణం, సంక్షేమం కోసం, బలహీన వర్గాలకు వైద్య సేవలు కల్పించేందుకు స్థలం కేటాయించాలని అప్పటి కలెక్టర్‌కు అర్జీ పెట్టుకోగా, ఆమెకు 26 ఎకరాల 54 సెంట్లు మంజూరు చేశారు. ఆ భూమిని లండన్ మిషనరీ కార్పొరేషన్ పేరుపై అప్పటి జిల్లా అధికారులు మార్పు చేశారు. 1932లో మిస్సమ్మ తిరిగి లండన్ వెళ్లి... అనారోగ్యంతో అక్కడే మరణించింది. ఆ తర్వాత ఆయా ఆస్తులు చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా వారి పర్యవేక్షణలో ఉన్నాయి. 2007లో ఫోర్జరీ సంతకాలతో జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జీపీఏ) పత్రాలు సృష్టించి, బీఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ పేరుతో సీఎస్ఐ నుండి 7.67 ఎకరాలు కొన్నామని మాజీ శాసనసభ్యులు నారాయణరెడ్డి సోదరులు ప్రచారంలోకి తీసుకొచ్చారు. అందుకు అవసరమైన పత్రాలు సృష్టించారు. అక్కడ నుంచి ఖాళీ చేయాలని పేదలకు నోటీసులు ఇచ్చి ఖాళీ చేసే ప్రయత్నం చేశారు. పేదవారి పక్షాన ప్రభుత్వ ఆస్తులను కాపాడటం కోసం అఖిలపక్ష కమిటీగా అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన ఆనాటి కలెక్టర్ శ్రీధర్‌తో చేత విచారణ చేయించి, ఇది క్రైస్తవ మైనారిటీ భూమి అయినందున ప్రభుత్వం నుండి ఎన్ఓసీ లేకుండా కొనడం చెల్లదని ఆ పత్రాలను సీజ్ చేశారు. 2009 సెప్టెంబర్ 2న రాజశేఖర్‌రెడ్డి ఆకస్మిక మరణాన్ని అనుకూలంగా మలచుకున్న బీఎస్ఆర్ సోదరులు తిరిగి దొంగ ఎన్వోసి సృష్టించి, రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. 2013లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్. కిరణ్‌కుమార్‌రెడ్డి చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా భూమిని పరిరక్షించడంలో భాగంగా మెడికల్ కళాశాల విస్తరణ కోసం మిస్సమ్మ స్థలాన్ని భూసేకరణ చట్టం ద్వారా కొనుగోలు చేయడానికి గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ ప్రక్రియ ముందుకు కొనసాగనీయకుండా బీయస్ఆర్ సోదరులు కోర్టులో న్యాయపరమైన చిక్కులు సృష్టించారు. 2015లో సీఎం చంద్రబాబు మిస్సమ్మ స్థల కబ్జాదారులు బీయస్ఆర్ సోదరులు సృష్టించిన నకిలీ పత్రాల వ్యవహారంపై, భూ కబ్జాలపై సీబీసీఐడీ విచారణకు ఆదేశించి,

వారి అక్రమాలను అడ్డుకునే ప్రయత్నం చేశారు.

బీఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్‌కు తాము ఎలాంటి భూమి అమ్మలేదని చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా అనేక దఫాలుగా రాతపూర్వకంగా జిల్లా కలెక్టర్‌లకు లేఖలు రాయడమేగాక, వారి నకిలీ డాక్యుమెంట్ పత్రాలు రద్దు చేయాలని కోరుతూ ఇప్పుడు ఓఎస్ నెంబర్ 44/2023గా 4వ జిల్లా అదనపు కోర్టులో కేసు వేశారు. ప్రభుత్వ భూమిని కాపాడాలని స్థానికంగా నివసిస్తున్న వారు జిల్లా కోర్టుతో పాటు హైకోర్టులోనూ చాలా కేసులు వేశారు. అవి ప్రస్తుతం విచారణ దశలో ఉన్నాయి. అయినప్పటికీ లెక్కచేయకుండా 3 మాసాల నుండి ఎర్రిస్వామిరెడ్డి సోదరులు, వారి అను చరులు పోలీసుల అండదండలతో ఆ స్థలానికి ప్రహరీగోడ నిర్మాణం చేసేందుకు...అక్కడి పేదవారిపై దౌర్జన్యం చేస్తూ, ఖాళీ చేయించే ప్రయత్నం చేస్తున్నారు. 16 ఏళ్ల నుండి ముగ్గురు ముఖ్యమంత్రులు ఆ భూమిని కాపాడేందుకు పటిష్ట చర్యలు తీసుకుని బీఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ ఆగడాలకు, అక్రమాలకు అడ్డుకట్ట వేయగా, 3 నెలల నుండి మరలా ఆ భూమిని చట్ట విరుద్ధంగా ఆక్రమించుకోవడానికి స్థానికంగా ఉండే ప్రజలపై, విద్యాసంస్థలపై దౌర్జన్యాలకు పాల్పడుతూ దాడులు చేస్తున్నారు. బీఎస్ఆర్ సోదరులు సృష్టించిన నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలు రద్దు చేయాలని చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా వారు వేసిన కేసు పెండింగ్‌లో ఉండగా బీఎస్ఆర్ సోదరులు దాడులకు తెగబడటం, పోలీసులు అందుకు సహకరించడం దుర్మార్గం. కోర్టు కేసు తుది తీర్పు వెలువడే వరకు ఆయా భూమిలో ఎలాంటి చట్టవిరుద్ధమైన అక్రమ కట్టడాలు జరపకుండా యధాతథ స్థితిని కొనసాగిం చేందుకు, స్థానిక పేదలకు, విద్యాసంస్థలకు రక్షణ కల్పించేందుకు రెవెన్యూ, పోలీసు అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని రామకృష్ణ కోరారు.

మీడియా ప్రతినిధులపై దాడిని ఖండిస్తున్నాం

వివేకా హత్య కేసులో ఎంపీ అవినాశ్‌రెడ్డి సీబీఐ ఎదుట విచారణకు హాజరుకావాల్సి ఉన్న తరుణంలో ఎంపీ వాహనాన్ని అనుసరిస్తున్న ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, హెచ్ఎం టీవీ మీడియా ప్రతినిధులపై అవినాశ్‌రెడ్డి అనుచరులు దుర్భాషలాడుతూ, మీడియా వాహనాన్ని ధ్వంసం చేసి, కెమెరా లాక్కోవడం, రిపోర్టర్, కెమెరా మెన్‌లను కొట్టి గాయపరచడం దుర్మార్గం. ప్రజాస్వామిక వ్యవస్థలో భౌతికదాడులు సరికాదు. మీడియా ప్రతినిధులపై దాడులకు పాల్పడిన వారిని తక్షణమే అరెస్టు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని రామకృష్ణ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

పేదలను ధనికులను చేస్తా

దాసరికులస్థులతో ముఖాముఖిలో చంద్రబాబు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ఆంధ్రప్రదేశ్‌లోని పేదలను ధనికులు చేయడమే లక్ష్యమని మాజీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. పేదల కోసం సంక్షేమ పథకాలను తెచ్చిన ఘనత టీడీపీదేనన్నారు. భారత్ ఒకప్పుడు ధనిక దేశమని గుర్తుచేస్తూ మరలా అదే స్థాయికి ఎదిగే విధంగా అభివృద్ధి పథంలో ముందుకెళుతోందని చెప్పారు. విజయనగరం జిల్లా ఎస్ కోటలోని శిరికి గ్రీన్ సిటీలో శుక్రవారం దాసరి కులస్థులతో చంద్రబాబు ముఖాముఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, తనది ముందు చూపు కాగా ప్రస్తుత సీఎంది దొంగ చూపు అని జగన్‌మోహన్ రెడ్డిని ఉద్దేశించి విమర్శించారు. ఇసుక, గనులు, మద్యం ద్వారా ఎంత కొట్టేద్దాం.. ఎంత మింగేద్దామనే ఆలోచనలోనే ఈయన ఉంటారుగానీ అభివృద్ధిని పట్టించుకోరని వ్యాఖ్యానించారు. పోలవరం ప్రాజెక్టును గోదావరిలో ముంచేశారని మండిపడ్డారు. వెనుకబడిన కులాల కోసం టీడీపీ ఎంతగానో కృషిచేసిందని, భవిష్యత్‌లోనూ చేస్తుందని ఆ పార్టీ అధినేత హామీనిచ్చారు. కులాల వారీగా సంక్షేమానికి కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. బీసీలకు గుర్తింపు వచ్చింది టీడీపీ వల్లేనని చెప్పారు.

టీడీపీ హయాంలో అనేక కంపెనీలు రాష్ట్రానికి వచ్చాయని, దురదృష్టవశాత్తు పార్టీ ఓడిపోయిన తర్వాత అధికారంలోకి వచ్చిన వారు ఏం చేశారో అవన్నీ వెనక్కి వెళ్లిపోయాయని చంద్రబాబు అన్నారు. 'పెందుర్తి-అరకు నాలుగు లైన్ల రహదారి గురించి ప్రతిపాదన చేశా, పోలవరం ఉత్తరాంధ్ర సుజల స్రవంతి నీటిని ఎస్.కోట నియోజకవర్గానికి తెద్దామనుకున్నా. కొత్తవలస ప్రాంతంలో 550 ఎకరాల్లో గిరిజన యూనివర్సిటీ రూపకల్పన చేశా. రూ.200కోట్లతో పతంజలి సంస్థ ద్వారా వ్యవసాయ ఆధార పరిశ్రమ ఏర్పాటుకు తలపెట్టా. కానీ పోలవరాన్ని గోదావరిలో ముంచేశాడు. పతంజలి పారిపోయింది. గిరిజన యూనివర్సిటీ తరలిపోయింది. అరకుకు నాలుగులైన్ల రహదారి వస్తే అక్కడ రిసార్ట్స్ వచ్చేవి. ఎంఎస్ఎంఈ పార్కు పెడదామనుకుంటే అదీ జరగలేదు. జిందాల్, షుగర్ ఫ్యాక్టరీ పోయింది. లూలూ కంపెనీవారు విశాఖపట్నంలో షాపింగ్ మాల్, కన్వెన్షన్ సెంటర్ పెట్టాలని వచ్చారు. వాటా ఆడిగేరో ఏమో వారు వెళ్లిపోయారు. హెచ్ఎస్బీసీ కూడా అంతే. విశాఖను ఫిన్ టెక్, నాలెడ్జ్ హబ్‌గా చేయడం కుదరలేదు. అమరావతిని మూడు ముక్కలాటతో ఈ సైకో సీఎం నాశనం చేశారు. సెంటు స్థలం ఇచ్చి ఇళ్లు కట్టిస్తానన్నారు' అని చంద్రబాబు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అమరావతిలో ఐదు శాతం భూమి పేదలకు నేను కేటాయించా గుర్తుందా అని ప్రశ్నించారు. ప్రజలు చైతన్యవంతులు కావాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. బీసీ ఫెడరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ కొల్లు రవీంద్ర, దాసరి సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ తుపాకుల అప్పారావు, దాసరి కులపెద్ద నానిగిరి రమానాజీ, చిప్పాడ శేషగిరిరావు మాట్లాడుతూ పేదలుగా ఉన్న దాసరి కులస్తులను గుర్తించి రిజర్వేషన్లు ద్వారా రాజ్యసభ వంటి పదవులు ఇవ్వాలన్నారు. రానున్న రోజుల్లో అందరూ కలిసికట్టుగా పనిచేసి టీడీపీకి విజయం సాధించి పెట్టాలని పిలుపునిచ్చారు. దాసరి కులస్తుల సమస్యలను కులపెద్దలు రత్నాజీ, మోపాడ కృష్ణంనాయుడు, వసంత సత్యారావు, చిప్పాడ శేషగిరిరావు, మోపాడ గౌరినాయుడు తదితరులు చంద్రబాబు దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, మాజీమంత్రి కోండ్రు మురళి పాల్గొన్నారు.

జర్నలిస్టుల రక్షణకు చట్టాలు తేవాలి

ఐజేయూ, ఏపీయూడబ్ల్యూజే డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : జర్నలిస్టులకు రక్షణ కరువైందని, వారి రక్షణకు కఠిన చట్టాలు తేవాలని ఐజేయూ, ఏపీయూడబ్ల్యూజే నాయకులు డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో భాగంగా సమాచార సేకరణకు వెళ్లిన పాత్రికేయులపై కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి అనుచరుల దాడిని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ),ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఏపీయూడబ్ల్యూజే),ఎలక్ట్రానిక్ మీడియా యూనియన్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఫ్యాక్షనిజాన్ని తలపించే విధంగా నడిరోడ్డుపై జర్నలిస్టులపై హత్యాయత్నం చేసే అధికారాన్ని అవినాశ్‌రెడ్డి అనుచరులకు ఎవరిచ్చారని సంయుక్త ప్రకటనలో ఐజేయూ స్టీరింగ్ కమిటీ సభ్యులు అంబటి ఆంజనేయులు, కార్యదర్శి డి.సోమసుందర్, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐవీ సుబ్బారావు, చందు జనార్ధన్, ఏపీఈఎంజేఏ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివ ఏచూరి, మురళీ మోహన్ ప్రశ్నించారు.

సమాచార సేకరణకు వెళ్లిన ఏబీఎన్ ప్రతినిధి శశి, హెచ్ఎంటీవీ ప్రతినిధి రత్నకుమార్‌పై భౌతికదాడి, ఏబీఎన్ వాహన అద్దాలను, హెచ్ఎంటీవి కెమెరాలు ధ్వంసం చేయడం ఆక్షేపణీయమన్నారు. అవినాశ్ రెడ్డి కనుసన్నల్లో ఈ దాడి జరిగిందని, ఎంపీగా ఉండి అప్రజాస్వామిక దాడులు చేయించి ఆ పదవికి ఆయన మచ్చతెచ్చారని విమర్శించారు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా జర్నలిస్టులపై దాడి చేసిన వారిని, అవినాశ్ రెడ్డి, ఆయన అనుచరులపై హత్యాయత్నం కేసు పెట్టాలని ఐజేయూ, ఏపీయూడబ్ల్యూజే నాయకులు డిమాండ్ చేశారు.

సరళీకరణ విశృంఖలత్వం ప్రమాదకరం

ప్రైవేటీకరణ దేశానికే నష్టం
ఆచార్య మనోహరరావు

విశాలాంధ్ర- విజయవాడ(చిట్టినగర్): సరళీకరణ విశృంఖలత్వం ప్రమాదకరమని ఆచార్య మనోహరరావు ఆందోళన వ్యక్తంచేశారు. సీపీఐ రాష్ట్ర విద్యా విభాగం అధ్వర్యంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో 'మార్క్సిస్టు రాజకీయ అర్థశాస్త్రంపై జరుగుతున్న రాష్ట్రస్థాయి అధ్యయన శిబిరం మూడో రోజు శుక్రవారం 'భారత దేశ ఆర్థిక వ్యవస్థ 1950 - 90 (సరళీకరణ ముందు), 1990-2021 (సరళీకరణ అనంతరం)' అంశంపై ఆయన సుదీర్ఘంగా మాట్లాడారు. 1950 వరకు ఇటు సాంకేతికంగా, అటు వ్యవసాయపరంగా దేశం ప్రణాళికాయుతంగా శరవేగంగా దూసుకు పోయిందని, ఆ తరువాత మెల్లగా సరళీకరణ ప్రవేశంతో పెట్టుబడిదారుల పట్టు బిగుసుకుందని వివరించారు. నెహ్రూ హయాంలో జరిగిన అభివృద్ధి మాత్రమే ఈ దేశంలో సుస్థిరంగా ఇప్పటికీ నిలిచిందని చెప్పారు. రాజీవ్‌గాంధీ ప్రధాని అయ్యాక సాంకేతిక రంగాన్ని శరవేగంగా ముందుకు తీసుకువెళ్లారని గుర్తుచేశారు. సరళీక రణకు ముందు తరువాత పరిణామాలపై సోదాహరణంగా వివరించారు.

'పెట్టుబడిదారీ వ్యవస్థలో సంక్షోభ పునరావృతం... మార్క్సిస్టు దృక్పథం' అంశంపై ఆచార్య ఆర్. రమణమూర్తి మాట్లాడుతూ మార్క్స్ విస్తృతంగా పరిశోధించి పెట్టుబడిదారీ ఆర్థిక విధానాలు, దోపిడీ పరిణామాలను ప్రపంచానికి తెలియజేశారు. మార్క్స్ ఆలోచనలను ఆయన రాసిన నోట్ ఆధారంగా ఏంగిల్స్ భావితరాలకు అందించారన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, రాష్ట్ర విద్యా విభాగం సబ్ కమిటీ కన్వీనర్ జేవీ సత్య నారాయణమూర్తి వక్తలను వేదికపైకి ఆహ్వానించారు. ప్రజాకళాకారులు ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి.

అతిపెద్ద సరస్సులు, రిజర్వాయర్లలో

నీటిశాతం తగ్గుముఖం

శాస్త్రవేత్తల హెచ్చరిక

న్యూఢిల్లీ: పర్యావరణ మార్పులతో ప్రపంచంలో నీటివనరులు అడుగంటుతున్నాయి. దీంతో భవిష్యత్తులో మానవ అవసరాలతో పాటు వ్యవసాయం, జల విద్యుత్తుపై తీవ్ర ప్రభావం పడనుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ప్రపంచంలోని సగానికి పైగా అతిపెద్ద సరస్సులు, రిజర్వాయర్లలో నీటి శాతం క్షీణిస్తోందని, 1990 ప్రారంభం నుండి ఈ తగ్గుదల నమోదవుతోందని ఓ అధ్యయనం తెలిపింది. ప్రపంచంలో అత్యంత ముఖ్యమైన మంచినీటి వనరులు కాస్పియన్ సముద్రం నుండి టిటికాకా సరస్సు వరకు సుమారు 3 దశాబ్దాలుగా ఏడాదికి సుమారు 22 గిగాటన్నుల పరిమాణంలో నీరు తగ్గిపోతున్నట్లు వెల్లడించింది. ఇది అమెరికాలోని అతిపెద్ద రిజర్వాయర్ లేక్ మీడ్ కంటే 17 రెట్లు అధికం. ప్రపంచవ్యాప్తంగా 53 శాతం సరస్సులు 1992 నుండి 2020 వరకు క్షీణత నమోదైందని తెలిపింది. అంతర్జాతీయ అధ్యయన వేత్తల బృందం చేపట్టిన ఈ అధ్యయనం సైన్స్ జర్నల్‌లో ప్రచురితమైంది. 1992, 2020 మధ్య సేకరించిన ఉపగ్రహ చిత్రాల సమాచారం ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు. దాదాపు రెండు వేల పెద్ద సరస్సుల ఉపగ్రహ కొలతలను, జలసంబంధ నమూనాలతో అంచనా వేశారు. మానవ అపరిమిత వినియోగం కారణంగా ఆసియాలోని అరల్ సముద్రం, మధ్యప్రాచ్యంలోని డెడ్‌సీ ఎండిపోయినట్లు తెలిపింది. అఫ్ఘానిస్తాన్, ఈజిప్ట్, మంగోలియాల్లో అధిక ఉష్ణోగ్రతల కారణంగా సరస్సులు ఎండిపోయినట్లు వెల్లడించింది. క్వింటాంగ్ పీఠభూమిలో రిజర్వాయర్ల నిర్మాణం కారణంగా అక్కడి సరస్సుల్లో నీటి మట్టాలు మూడొంతులు పెరిగినట్లు తేల్చారు. మంచినీటి సరస్సుల్లో నీటి క్షీణత గ్లోబల్ వార్మింగ్, మానవ వినియోగం కారణంగా నమోదైందని ఈ అధ్యయనానికి నేతృత్వం వహించిన వర్జీనియా యూనివర్సిటీ భూ, జల నిపుణులు ఫాంగ్‌ఫాంగ్ యావో తెలిపారు. దీనిలో గ్లోబల్ వార్మింగ్‌దే అధిక వాటా ఉన్నట్లు వెల్లడించారు. మానవ వినియోగం, వర్షపాతంలో మార్పులు, ప్రవాహవేగం, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, నీరు ఆవిరి కావడం వంటి వాటి కారణంగా ప్రపంచవ్యాప్తంగా సరస్సుల్లో నీటిస్థాయిలు తగ్గాయని పేర్కొన్నారు. వాతావరణ మార్పుల కారణంగా వచ్చే అత్యంత విపత్కర పరిస్థితులను నివారించడానికి గ్లోబల్ వార్మింగ్‌ను 1.5 డిగ్రీలకు మించకుండా నిరోధించాలని శాస్త్రవేత్తలు, ప్రచారవేత్తలు హెచ్చరిస్తున్నారు.

గోదుమ సేకరణలో కేంద్రం విఫలం

- లక్ష్యం కంటే తక్కువ కొనుగోలు
- ప్రతికూల వాతావరణంతో నష్టపోయిన రైతులు

న్యూఢిల్లీ: రైతులు ఆరుగాలం కష్టించి పండించిన గోదుమ పంట కొనుగోలులో కేంద్ర ప్రభుత్వం విఫలమయింది. కేవలం 26 మిలియన్ టన్నులు మాత్రమే కొనుగోలు చేసింది. అది లక్ష్యంగా పెట్టుకున్న 34.15 మిలియన్ టన్నుల కంటే గణనీయంగా తక్కువగా ఉందని ఒక ఆంగ్ల వార్తా సంస్థ పేర్కొంది. ఏప్రిల్ 26 నాటికి గోదుమ సేకరణ 19.5 మిలియన్ టన్నులుగా ఉందని ఏప్రిల్ చివరిలో మరొక వార్తా సంస్థ నివేదిక పేర్కొంది. గత సంవత్సరం, ఆ సమయంలో ఆ మొత్తం 18.8 మిలియన్ టన్నుల కంటే ఎక్కువగా ఉంది. మే నెలలో గణనీయమైన మొత్తంలో గోదుమలను సేకరించినట్లు ఆ నివేదిక సూచించింది. మార్చి, ఏప్రిల్ నెలల్లో వర్షాలు, వడగళ్లు గోదుమ పంటను దెబ్బతీశాయి. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సేకరణ నిబంధనలను సడలించాల్సి వచ్చింది. గత సంవత్సరం కూడా గోదుమ ఉత్పత్తిపై ప్రభావం చూపింది. మార్చి 2022 అత్యధిక ఉష్ణోగ్రతల ఫలితంగా తక్కువ ఉత్పాదకత ఏర్పడింది. దీని కారణంగా మొత్తం గోధుమ సేకరణ కేవలం 187.9 లక్షల టన్నులు మాత్రమే జరిగింది. ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) సంక్షేమ పథకాలకు కేటాయించిన దాని కంటే చాలా తక్కువ. ప్రభుత్వం అంచనా వేసిన 112 మిలియన్ టన్నుల నుంచి వాతావరణ కారకాలు 3-4 మిలియన్ టన్నుల ఉత్పత్తిని తగ్గించవచ్చని విశ్లేషణ పేర్కొంది. ఈ సంవత్సరం సేకరణ అన్ని పీడీఎస్ కార్యక్రమాలకు అందించడానికి 'సుమారు 6 నుంచి 7 మిలియన్ టన్నుల మిగులును' వదిలి వేయడానికి సరిపోతుందని పేర్కొంది. అయితే ఎల్‌నినో పరిస్థితులు బలపడటం వల్ల రుతుపవనాల లోపానికి వ్యతిరేకంగా భారతదేశం ఆహార భద్రత ప్రశ్నలను ఉంచింది. తక్కువ వర్షపాతం కేవలం గోదుమలపైనే కాకుండా వరి, వంట నూనెలు, ఇతర ఆహార పంటలపై కూడా ప్రభావం చూపుతుంది. 'అత్యంత దారుణమైన పరిస్థితికి' సన్నద్ధం కావాలని కేంద్ర వ్యవసాయ కార్యదర్శి మనోజ్ అహూజా చెప్పారని 'ది వైర్' గతంలో పేర్కొంది. 'తక్కువ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి. ఎల్ నినో పరిస్థితులు ఏర్పడకుండా ఉండే అవకాశాలు ఉన్నాయి. రాష్ట్ర స్థాయిలో పూర్తి సంసిద్ధత ఉండాలి' అని అహూజా అన్నారు.

అంతా ఖడ్గేమయం

- సారథిపైనే కాంగ్రెస్ ఆశలు
- రాజస్థాన్, మధ్యప్రదేశ్ సమస్యల పరిష్కారానికి అధ్యక్షుడే ఆధారం

న్యూఢిల్లీ: కాంగ్రెస్‌లో అంతా ఖడ్గేమయంగా మారింది. అధ్యక్షుడు చెప్పిందే శాసనమన్న పరిస్థితి కర్నాటకలో పార్టీ అఖండ విజయంతో ఏర్పడింది. అధిష్టానం సైతం సారథిపైనే పూర్తిగా ఆశలు పెట్టుకున్నది. అసెంబ్లీ ఎన్నికలతో పాటు వచ్చే ఏడాది జరగాల్సిన సార్వత్రిక ఎన్నికల్లోనూ పార్టీని విజయపథంలో నడపగలిగినది ఖడ్గేనే అని నమ్ముతోంది. అటు విపక్షాల ఐక్యతకు జరుగుతున్న కసరత్తులో, రాజస్తాన్‌లో పార్టీ అంతర్గత సమస్యల పరిష్కారంలోనూ ఖడ్గేనే కీలకంగా మారారు.

కర్నాటకలో కాంగ్రెస్ అఖండ విజయం సాధించడం ఆ పార్టీకి నూతనోత్సాహాన్ని ఇచ్చింది. రాబోయే ఎన్నికల్లో రాణించగలమన్న ధీమాను పెంచింది. మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, రాజస్తాన్, తెలంగాణ రాష్ట్రాలలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలతో పాటు 2024లో పార్లమెంటరీ ఎన్నికల్లోనూ గెలవగలమన్న ఆశలు కాంగ్రెస్‌లో చిగురిస్తున్నాయి. అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే పార్టీకి ఆధారంగా (మిస్టర్ డిపెండబుల్) మారారు. ఈయన మరో మన్మోహన్ సింగ్ అయ్యారు. సింగ్, ఖడ్గే పాత్రలు భిన్నమైనవే అయినాగానీ సోనియాగాంధీ, రాహుల్, ప్రియాంక గాంధీకి నమ్మకస్తులు. ఏఐసీసీకి 88వ అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి పార్టీపై పట్టును ఖడ్గే పెంచుకున్నారు. ప్రతిపక్షాలతో సంప్రదింపులు, ఎన్నికల వ్యూహాలు వంటివన్నీ చూసుకుంటున్నారు. పార్టీలో అంతర్గత విభేదాలు, కుమ్ములాటలను చాకచక్యంగా కట్టడి చేయడమే కాకుండా వాటి ప్రభావం పార్టీ పనితీరుపై పడకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. పార్టీ సారథిగా కాంగ్రెస్ కార్యకలాపాలన్నీ సజావుగా సాగిస్తున్నారు. దీంతో

అధిష్ఠానంతో పాటు పార్టీ శ్రేణుల నమ్మకాన్ని పొందారు.

రాజస్థాన్ సమస్యను ఖడ్గే పరిష్కరించగలరన్న ధీమా కాంగ్రెస్‌కున్నది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్, మాజీ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలెట్‌కు మధ్య గొడవ తారాస్థాయికి చేరుకుంది. గెహ్లాట్‌కు లేక పైలెట్‌కు వ్యతిరేకంగా చర్యలు తీసుకునే స్థితిలో ఖడ్గే లేరు. జైపూర్‌లో సలహా సంఘాలు కూడా ఏమీ చేయలేకపోతున్నాయి. ఈనెలాఖరులోగా రాజస్థాన్ సమస్యను పరిష్కరించగలమన్న ధీమాను ఖడ్గే వ్యక్తంచేస్తున్నారు. అయితే తాను లేవనెత్తిన అంశాలకు అధిష్ఠానం పరిష్కారాల కోసం మే 31 వరకు వేచివుంటానని పైలెట్ ప్రకటించారు. మరోవైపు నేను ప్రాణాలతో ఉన్నంత వరకు పైలెట్‌ను ముఖ్యమంత్రి అవ్వనివ్వనని గెహ్లాట్ సంకల్పించారు. ఖడ్గే తన దృష్టిని పూర్తిగా రాజస్థాన్ వైపునకు మళ్లించాలని, పైలెట్, గెహ్లాట్ భవిష్యత్ పాత్రపై ఫార్ములా అమలునకు యత్నిస్తున్నారు. ఇందుకోసం ప్లాన్ ఎ, ప్లాన్ బీ సిద్ధం చేసుకున్నారు. అటు మధ్యప్రదేశ్‌లో కర్నాటక నమూనా అమలుకు కాంగ్రెస్ యోచిస్తోంది. ఖడ్గేకు కర్నాటకలో సిద్ధరామయ్య ఉన్నట్లే మధ్యప్రదేశ్‌లో కమల్‌నాథ్ ఉన్నారు. సీనియరిటీతో పాటు నిబద్ధగతల నాయకుడిగా ఉన్న కమల్‌నాథ్‌కు ఖడ్గేతో పాటు గాంధీ కుటుంబంతో దగ్గర సంబంధాలున్నాయి. ఈ ఏడాది చివరిలో మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ రాష్ట్రంపై దృష్టి పెట్టాలని ప్రియాంక గాంధీని కమల్‌నాథ్ కోరారు. ఇప్పటికే సీనియర్ నేత కుమారీసెల్జా, ఏఐసీసీ పరిశీలకులు రాయ్‌పూర్‌కు మకాం మార్చారు. వచ్చే ఆరు నెలల్లో అనుసరించే ఎన్నికల ప్రణాళికలు రూపొందించే పనిలో ఉన్నారు.

అయితే ఖడ్గే గురించి ఆయన మాటలు విన్నాం.. రాతలు చూశాం. కానీ మెల్లమెల్లగా తన అధ్యక్ష పాత్రలోకి వచ్చారు. కాంగ్రెస్ అధ్యక్షుడిగా పరిణితి చెందారు. పూర్తిస్థాయిలో సారథిగా వ్యవహరిస్తూ పార్టీని ముందుకు నడిపిస్తున్నారు. ఇక కాంగ్రెస్ ముందర ఉన్న మరో బృహత్ కార్యం విపక్షాల ఐక్యత. బలబలాల ఆధారంగా కూటమలు ఏర్పాటయ్యే ఆనవాయితీ క్రమంలో కాంగ్రెస్‌కు నాయకత్వం లభించకపోవచ్చు. ఎన్డీయేయేతర పార్టీలతో చర్చలలో ఖడ్గే పాత్ర కీలకంగా ఉన్నది. నితీశ్‌కుమార్, అరవింద్ కేజ్రీవాల్, మమతా బెనర్జీ, కె.చంద్రశేఖరరావును ఏకతాటిపైకి ఖడ్గే తేగలరన్న దీమా కాంగ్రెస్‌కున్నది. కర్నాటక, బీహార్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్రలోని రాజకీయ పరిస్థితులతో లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని కట్టడి చేయొచ్చని ఆకాంక్షిస్తోంది. విపక్షాలన్నీ ఏకమైతే బీజేపీని ఓడించడం నల్లేరుపై నడకే అన్న దీమా ఖడ్గేకు ఉంది.

కాంగ్రెస్‌లో చేరినందుకు...

అంబాసిడర్‌గా పార్మర్ తొలగింపు

భోపాల్: మధ్యప్రదేశ్ నుంచి ఎవరెస్ట్ పర్వత శిఖరాన్ని అధిరోహించిన తొలి మహిళగా రికార్డు సృష్టించిన మేఘా పార్మర్‌కు చౌహాన్ ప్రభుత్వం షాకిచ్చింది. 'బేటీ బచావో బేటీ పడావో', రాష్ట్ర డెయిరీ బ్రాండ్ సాంచికి ప్రచారకర్తగా ఉన్న ఆమెను ఆ బాధ్యతల నుంచి తొలగించింది. పార్మర్ కాంగ్రెస్‌లో చేరడమే ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. మేఘా పార్మర్ ఇటీవల రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. మే 9న ఛింద్వాడాలో జరిగిన ఓ కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ సమక్షంలో ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ మరుసటి రోజే రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. బేటీ బచావో బేటీ పడావోకు రాష్ట్ర అంబాసిడర్‌గా ఉన్న ఆమెను బాధ్యతల నుంచి తప్పించింది. ఇది జరిగిన కొద్ది రోజులకే తాజాగా మధ్యప్రదేశ్‌లోని శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రభుత్వం మరో నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర పాల ఉత్పత్తుల బ్రాండ్ సాంచికి ప్రచారకర్తగా ఉన్న మేఘాను తొలగించింది. ప్రభుత్వ చర్య విమర్శలకు దారితీసింది. మేఘా పార్మర్ కాంగ్రెస్‌లో చేరారన్న కారణంతోనే ఆమెను ప్రచారకర్తగా తొలగించారని బీజేపీ సర్కారుపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన మేఘా పార్మర్... దేశం గర్వపడేలా చేశారని, అలాంటి వ్యక్తిని బ్రాండ్ అంబాసిడర్ పదవి నుంచి తప్పించారని, కాంగ్రెస్‌లో చేరడమే ఆమె చేసిన నేరమా అని పార్టీ నేత కేకే మిశ్రా ప్రశ్నించారు. చౌహాన్ ప్రభుత్వంపై మిశ్రా మండిపడ్డారు. తాజా పరిణామాలపై మేఘా పార్మర్ స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వంపై అసహనం వ్యక్తం చేశారు. తాను రైతు బిడ్డనని, ఎవరెస్ట్ అధిరోహిస్తానని కలలో కూడా ఊహించలేదని, కానీ, మాజీ సీఎం కమల్‌నాథ్ తనకు ఎంతో సాయం చేశారని చెప్పారు. కమల్‌నాథ్ ఆర్థికంగా అండగా నిలవడం వల్లే తాను ఎవరెస్ట్ ఎక్కగలిగానన్నారు. సినిమా హీరోయిన్లను పక్కనబెట్టి నాటి కమల్‌నాథ్ ప్రభుత్వం ఓ రైతు బిడ్డనైన తనను బేటీ బచావో- బేటీ పడావోకు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించారని గుర్తు చేశారు. ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం తనను ఆ బాధ్యతల నుంచి తొలగించిందని ఆమె మండిపడ్డారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.